RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 10 మంగళవారం 4 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

## 5 నుంచి విమాన రాకపోకలకు అంతరాయం

బెంగళూరు : ఏరో ఇండియా వైమానిక ప్రదర్శనల నేపథ్యంలో ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు బెంగళూరుకు అనుబంధమైన కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (కేఐఏ) నుంచి విమాన రాకపోకలకు అంతరాయం కలగనుందని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రకటించింది. ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విమాన రాకపోకలు నిలిపివేయనున్నట్టు కేఐఏ ప్రకటించింది. 7, 9 తేదీల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రాకపోకలు ఆపేస్తారు. ఈనెల 10న ఎయిర్‌షో లాంఛనంగా ప్రారంభం కానుంది. ఆ రోజున ఉదయం 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు విమాన రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తారు.

# బీసీ కోటాపై నేడు అసెంబ్లీ

## కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపైనా చర్చ

### శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశం - దానికి ముందు రాష్ట్ర మంత్రివర్గ భేటీ



హైదరాబాద్ : స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అవుతోంది. మంగళవారం శాసనసభ, మండలి ప్రత్యేక భేటీ జరగనుంది. దానికి ముందు ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై అజెండాను ఖరారు చేయనుంది. సమగ్ర ఇంటింటి సర్వే పేరిట కులాల వారీగా ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులపై సర్వే నిర్వహించిన ప్రణాళికా విభాగం.. సంబంధిత నివేదికను ఆదివారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలోని మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించింది. అలాగే ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య న్యాయ కమిషన్ కూడా ఉత్తమ్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘానికి సోమవారం నివేదిక ఇచ్చింది. మరోవైపు స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాపై విశ్రాంత అధికారి బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్ కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే, స్థానిక ఎన్నికల్లో బీసీ కోటా, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై సమీక్షించనున్నారు. అనంతరం ఈ అంశాలపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అవుతుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమవనున్న సమావేశం.. ఈ అంశాలపై చర్చ ముగిసే వరకూ కొనసాగనుంది. బీసీ కేటగిరీ ముస్లింలతో కలుపుకొని రాష్ట్రంలో బీసీ జనాభా 56.33 శాతం మేరకు ఉన్నట్లు సమగ్ర కులగణన సర్వే తేల్చింది. ఈ వివరాల ఆధారంగానే బూసాని వెంకటేశ్వరరావు కమిషన్.. స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాపై నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. కులగణన సర్వే ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభా 27.88 శాతం మేరకు ఉంది. అంటే వారికి స్థానిక సంస్థల్లో 27 నుంచి 28 శాతం వరకు రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం బీసీలకు దక్కే రిజర్వేషన్ 22-23 శాతం మాత్రమే. బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచాలంటే పార్లమెంటులో చట్ట సవరణ చేయడంతో పాటు 9వ షెడ్యూల్‌లో పేర్కొనాల్సిందే. ఈ మేరకు సమగ్ర వివరణతో కూడిన నివేదికను బూసాని కమిషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు పెంచడానికి వీలుగా ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే చట్టాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి, కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. అలాగే ఎస్సీ వర్గీకరణపైనా అసెంబ్లీలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

**బడ్జెట్ సమావేశాల్లోపే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు?...** సర్పంచ్ ఎన్నికలకు ముందే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సర్కారు కొలువుదీరి ఏడాది పూర్తయినా తమకు ఇంకా పదవులు దక్కకపోవడంపై క్షేత్రస్థాయి నేతల్లో కొంత అసహనం ఉంది. స్థానిక ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలంటూ వారు పార్టీ రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పార్టీ గుర్తుపై జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలనే ముందుగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఆ తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు సమాచారం. అయితే స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతామని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలే స్థానిక ఎన్నికల ముందు ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. సీఎం మాత్రం ఈ రెండు అంశాల్లోనూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అవుతోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అయితే అందుకు పార్లమెంటులో చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని అసెంబ్లీ ద్వారా ప్రజల దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ చర్చలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులనూ భాగస్వాములను చేసి.. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే చట్టాన్ని సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించనున్నారు. పార్లమెంటు సమావేశాలు ఈ నెల 11 వరకు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ తీర్మానాన్ని బుధవారం కేంద్రానికి పంపనున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై దాఖలైన పిటిషన్ల మీద విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఎప్పటిలోగా ఎన్నికలు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనికి రేవంత్ సర్కారు సమాధానం ఇవ్వాల్సి ఉంది. మరోవైపు స్థానిక ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. ఈ క్రమంలో పార్లమెంటు బడ్జెట్ తొలి సెషన్ ముగిసే వరకూ ప్రభుత్వం వేచి చూడనుంది. ఆలోగా స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంపుపై కేంద్రం స్పందించకపోతే పాత రిజర్వేషన్ల ప్రకారమే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

అయితే కాంగ్రెస్ పార్టీ పక్షాన బీసీలకు 42 శాతం టికెట్లను కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## తెలంగాణ బీజేపీ జిల్లా అధ్యక్షుల ప్రకటన.. 25 జిల్లాల అధ్యక్షులను ప్రకటించిన బీజేపీ



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీలో సంస్థాగత ఎన్నికల కోలాహలం షురువైంది. పార్టీ బూత్, గ్రామ, మండల కమిటీల ఎన్నికలు పూర్తి చేసుకున్న రాష్ట్ర బీజేపీ నాయకత్వం జిల్లా కమిటీల అధ్యక్షుల ఎంపికపై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు 25 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించింది. ఏకాభిప్రాయం కుదరని మరో 13 జిల్లాల అధ్యక్షుల నియామకాన్ని పెండింగ్‌లో పెట్టింది. పార్టీ పరంగా వ్యవహారాల కోసం మొత్తం 38 జిల్లాలుగా తెలంగాణను విభజించి అధ్యక్షుడ్ని ప్రకటించడం బీజేపీలో ఉంది. ఇక.. రాష్ట్రానికి కొత్త అధ్యకుడు వచ్చాక మిగతా జిల్లాల అధ్యక్షుల ఎంపిక ఉంటుంది. అన్నీ అనుకూలిస్తే వారంలోనే రాష్ట్ర బీజేపీకి కొత్త సారథి వచ్చే అవకాశం ఉంది. ఇన్‌ఛార్జ్ శోభ కరంద్లాజే ముఖ్య నేతల అభిప్రాయం తీసుకున్నాక ఒకరిపేరు ఫైనల్ అయ్యే ఛాన్స్ ఉందంటున్నారు. ఒకవేళ ఏకాభిప్రాయం రాకపోతే అధ్యక్షుడితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్స్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్ అధ్యక్షుడిగా లంక దీపక్ రెడ్డి, అదేవిధంగా జయశంకర్ భూపాల్‌పల్లి అధ్యక్షుడిగా నిశిధర్ రెడ్డి, కామారెడ్డి అధ్యక్షుడిగా నీలం చిన్న రాజులు, హనుమకొండ అధ్యక్షుడిగా కొలను సంతోష్ రెడ్డి, వరంగల్ అధ్యక్షుడిగా గంట రవికుమార్, నల్లగొండ అధ్యక్షుడిగా నాగం వర్షిత్ రెడ్డి, జగిత్యాల అధ్యక్షుడిగా రాచకొండ యాదగిరి బాబులను ఫైనల్ చేసినట్లుగా సమాచారం. కాగా, జిల్లా అధ్యక్ష పదవులకు శనివారం పలువురు నామినేషన్లు వేయగా.. అందులో కొందరు ఆదివారం తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. అయితే, పార్టీ వారి పేర్లను ఇంకా ప్రకటించలేదు. పార్లమెంట్ సమావేశాలు ముగిసే లోగా రాష్ట్రానికి కొత్త చీఫ్‌ను నియమించాలని పార్టీ భావిస్తోంది. ఆ తరువాత మిగిలిన జిల్లాలు, మండలాలకు అధ్యక్షులను నియమించే అవకాశం ఉంది. పార్టీ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు, కార్యవర్గ సభ్యులను కూడా నియమించే ఆలోచనలో ఉన్నారు. ఇక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్థానంలో కొత్తగా బీసీ వర్గాలకు ఈ పదవి ఇవ్వాలని పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. అనేక మందితో చర్చించిన తర్వాత పార్టీ నాయకత్వం ఈటల రాజేందర్ పేరు ఖరారు చేసినట్లుగా పార్టీలో చర్చ నడుస్తోంది.

ఇదే సమయంలో మరో ఇద్దరు నేతలు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్టానం నిర్ణయంలో ఎలాంటి మార్పు లేకపోతే ఈటల రాజేందర్ తెలంగాణ బీజేపీ కొత్త సారథిగా నియమితులు అవ్వడం ఖాయమనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది.




వైరా : రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు ఈ నెల 15లోపు షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడక, గరికపాడు, దాసాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సాదా బైనమా, ఇందిరమ్మ ఇండ్లు, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ''ఈ నెల 15లోపు ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఎన్నికలు ముగిసిన తర్వాత నెల గడువు విధించి భూ భారతి ద్వారా సాదా బైనమా సమస్యలు పరిష్కరిస్తాం. అలాగే, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం'అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజముల్ ఖాన్‌కు మంత్రి ఫోన్‌లో ఆదేశించారు. గన్నవరం, గొల్లపూడి గ్రామాలలో 80 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దానిని అర్హులైన పేదలకు అందించాలని సూచించారు. అనంతరం పంచాయతీ ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హోరాహోరీగా ఢిల్లీ ఎన్నికలు!

## అంతుచిక్కని కేజ్రీవాల్ వ్యూహాలు...

## ప్రధాని మోడీకి ప్రతిష్టాత్మకం!




ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో గెలుపుకోసం అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, బీజేపీలతో పాటు ఇతర పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేశాయి. అయితే, ఈ ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని కమలనాథులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అలాగే, తిరిగి అధికారంలోకి రావాలని అధికార ఆప్ పార్టీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారు. కేజ్రీవాల్ వ్యూహాలు కమలనాథులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. 2014 నుంచి ఆయన అనుసరిస్తున్న వ్యూహాలను డీకోడ్ చేయలేక బీజేపీ ఎదుర్కొంటోంది. ఇది ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. దేశంలో జరిగే ఎన్నికల్లో బీజేపీ ఎన్నికల్లో విజయం సాధిస్తుంది. కానీ, ఢిల్లీ మాత్రం ఆయన పార్టీకి పరాజయం తప్పడం లేదు. గత రెండుసార్లు బీజేపీ చాలా దారుణ పరాజయాలు ఎదుర్కొంది. ఇది మోడీ ప్రతిష్ఠను మసకబారేలా చేస్తోంది. గతంలో పలుమార్లు ఓటమి అంచుల్లోకి వెళ్లి మరీ విజయం సాధించిన మోదీ.. విచిత్రంగా ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూస్తూనే ఉన్నారు. 'కోడ్ కేజ్రీవాల్' ఇప్పటికీ బీజేపీకి మిస్టరీగా మారింది. దీంతో కేజ్రీవాల్ వ్యూహాలను ఛేదించేందుకు బీజేపీ కొత్త ఎత్తులు వేస్తోంది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కేజీవాల్ మరింత దూకుడుగా ముందుకెళ్తూ బీజేపీని ఎక్కడికక్కడ ట్రాప్ చేస్తున్నారు. బీజేపీ అనూహ్యంగా అందులో చిక్కుకుని విలవిల్లాడుతోంది. కేజీవాల్ ఈ ఎన్నికలు కత్తి మీద సాములాంటివనే చెప్పాలి. అవినీతి ఆరోపణలు, జైలుకు వెళ్లడం వంటివి ఆయనను కొంత దుర్బలంగా మార్చాయి.

అయితే, ఈ ఎన్నికలు తన దశాబ్దకాల కెరీర్లో అత్యంత క్లిష్టమైనవని ఆయనకు తెలుసు. దీనికి తోడు 11 ఏళ్ల ప్రభుత్వ వ్యతిరేకతను కూడా ఆయన ఈ ఎన్నికల్లో ఎదుర్కోవాల్సి ఉంది. దేశాన్ని అవినీతి రహిత సమాజంగా మారుస్తానని ఒకప్పుడు హామీ ఇచ్చిన కేజ్రీవాల్ ఇప్పుడు స్వయంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం ఆయనను మానసికంగా కొంత బలహీనంగా మార్చాయి. ఢిల్లీ ఎన్నికల్లో ఈసారి కూడా బీజేపీ ఓడిపోతే కనుక బీజేపీని తప్ప మరెవరినీ లేమని నిపుణులు చెబుతున్నారు. 2013లో మోడీ దేశంలో హీరోగా మారినప్పుడు, ఆ తర్వాత లోక్సభ ఎన్నికల్లో 303 సీట్లతో ఆయన ప్రజాదరణఅమాంతం పెరిగినప్పుడు కూడా కేజీవాల్‌ను ఏమీ చేయలేక పోయారు. కేజ్రీవాల్ అబద్ధాలకోరు అని, సొంత గురువు అన్నా హజారేను మోసం చేశారని, ఒకప్పటి తన సహచరులను వదిలేశారని, ఆయన నకిలీ హిందువు అని, అవకాశవాది అని, అర్బన్ నక్సల్ అని.. ఇలా బీజేపీ ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు పట్టించుకోకుండా ఆయనకే పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పుడీ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. అధికారాన్ని నిలుపుకోవాలని కేజీవాల్, ఈసారి ఎలాగైనా ఆయనను పడగొట్టి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని కమలనాథులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కాబట్టి గెలిచేది ఎవరో తెలియాలంటే మరో పది రోజులు ఆగాల్సిందే.

## సంపాదకీయం

# ఎమ్మెల్యేల రహస్య భేటీ దుమారం!

## కండ కండాలుగా ఖండిస్తున్న ఎమ్మెల్యేలు

తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్యభేటీ దుమారం రేపుతోంది. ఓ మంత్రికి వ్యతిరేకంగా కొందరు ఎమ్మెల్యేలు సీక్రెట్ గా సమావేశమయ్యారనే వార్త రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. ఈ భేటీకి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే నేతృత్వం వహించారని, పది మంది వరకు హాజరైన ఎమ్మెల్యేలు మంత్రి తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారని మీడియాలో ప్రచారం జరిగింది. అయితే తాము అలాంటి సమావేశాలు ఏమీ జరపలేదని ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా ఖండిస్తున్నారు. ఇంతకీ కాంగ్రెస్ ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ జరిగిందా? లేదా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై ఇటీవల తీవ్రస్థాయిలో రియాక్ట్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేల భేటీ సమాచారం సంచలనం రేపింది. ఈ విషయంపై కాంగ్రెస్ తోపాటు ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ స్పందించాయి. కాంగ్రెస్ లో అసమ్మతి మొదలైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, కాంగ్రెస్ మాత్రం తమ ఎమ్మెల్యేల సమావేశమేమీ జరగలేదని చెబుతోంది. ఈ నేపథ్యంలో సమావేశానికి వెళ్లారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు సైతం స్పందిస్తున్నారు. ప్రతిపక్షాల విమర్శలను, మీడియా ప్రచారాన్ని ఖండిస్తున్నారు. సమావేశానికి నేతృత్వం వహించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కూడా రహస్య భేటీ వార్తలపై రియాక్ట్ అయ్యారు. మీడియా అంటే తనకు ఎంతో గౌరవం ఉందని, కానీ వక్రీకరించి వార్తలు రాయడం సబబు కాదని వ్యాఖ్యానించారు. తాము ఎలాంటి రహస్య సమావేశాలు నిర్వహించలేదని వివరణ ఇచ్చారు. ఒకవేళ సమావేశం జరిగినట్లు ఏ ఆధారం చూపినా తనపై చర్యలు తీసుకోవచ్చని సవాల్ విసిరారు. తాము రహస్యంగా కలిశామని వార్తలు ప్రచారం చేయడం సరైన చర్యకాదన్నారు. ప్రతిపక్షం బీఆర్ఎస్ ఒక ఫేక్ ప్రచారాన్ని తెరపైకి తెస్తే, మీడియా, కొందరు యూట్యూబర్లు అదే అంశాన్ని హైలెట్ చేయడం భావ్యం కాదన్నారు. ఇక ఇదే అంశంపై మరో ఎమ్మెల్యే నాయిని రాజేంద్రరెడ్డి కూడా స్పందించారు. తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై కుట్ర జరుగుతోందని చెప్పడానికి ఈ ప్రచారమే నిదర్శనమన్నారు. కుట్ర వెనుక ఎవరున్నా వదిలే ప్రసక్తి లేదని నాయిని హెచ్చరించారు. తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వివరణ ఇస్తామని నాయిని రాజేంద్రరెడ్డి వివరించారు. సమావేశం జరగలేదంటూనే ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వడంపై రాజకీయ పరిశీలకులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిప్పులేనిదే పొగురాదు కదా అంటున్నారు. మరోవైపు ఈ అంశంపై కాంగ్రెస్ హైకమాండ్ ఆరా తీస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి వ్యక్తిగతంగా మాట్లాడినట్లు చెబుతున్నారు. రహస్య భేటీ జరిగిందా? లేదా? ఎందుకు పది మంది ఎమ్మెల్యేలు ఒకేచోట చేరాల్సివచ్చిందన్న విషయాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. మరోవైపు ఎమ్మెల్యేలను సతాయిస్తున్న మంత్రి ఎవరన్న చర్చ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది.

# అర్జీలను వీలైనంత త్వరలో పరిష్కరించండి...

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి





గరుడ వార్త ( జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి) : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్ఓ హరిప్రియతో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలు స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (61 ) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్



శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం మనీ మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్ అన్నారు.

మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ ప్రత్యేక చొరవతో జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు ఉద్దమర్రి గ్రామానికి మంజూరు చేసిన రూ. 10 లక్షలతో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, స్థానిక నాయకులతో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు దోసకాయల వెంకటేష్, పట్ట బాల్ నర్సింహా, సీనియర్ నాయకులు నేమూరి విష్ణు గౌడ్, బొద్దుల ప్రసాద్, రాజిరెడ్డి, బస్వారెడ్డి, జగన్నాథం, జెర్రిపోతుల నర్సింలు, తూమ్ వేణుగోపాల్, వైద్యానాథ్, ఏటావాలి లక్ష్మణ్, తునికి వెంకటేష్, నర్సింలు, గోపిరెడ్డి, నాగేష్, పాండు,నవీన్ చారి పాల్గొన్నారు.

# ఈసారి.. ఉపాధి అంతంతే..!



కొణిజర్ల : పంటలకు నీరు చేరాలంటే కాలువలు సక్రమంగా ఉండాలి. కొన్నేళ్ల నుంచి ఉపాధి హామీ పథకంలో కాలువలకు ప్రత్యేకంగా నిధులు, పని దినాలు కేటాయించడంతో చాలావరకు బాగుపడ్డాయి. గ్రామాల్లోని సాగర్ ఆయకట్టు, చెరువుల కింద ఉన్న సాగునీటి కాలువలను కూలీల ద్వారా పనులు చేయించడంతో మెరుగుపడుతూ సాగునీటికి భరోసా కల్పించాయి. ఈ ఏడాది నుంచి ఉపాధి పథకంలో కాలువల పనులు తొలగించడంతో అన్నదాతలకు కష్టాలు మొదలయ్యే పరిస్థితి నెలకొంది. నీటిపారుదలశాఖ మైనర్, పంట కాలువలను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. ప్రస్తుతం ఈ పనులను కేంద్రం పక్కన పెట్టడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పని పరిస్థితి ఏర్పడింది.

**వారు చేయరు.. ఇక్కడ గుర్తించరు**

నీటిపారుదల శాఖ ద్వారా ఇంతవరకు సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టలేదు. బ్రాంచి, మేజర్ కాలువలకు నిధులు కేటాయించి బాగు చేస్తున్నారు. మైనర్, పంట కాలువలను వదిలేస్తుండటంతో అవి అధ్వానంగా మారాయి. అటువంటి పనులను ఉపాధి పథకంలో గుర్తించి కూలీల ద్వారా కాలువలను మెరుగుపరుస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 17 మండలాలు సాగర్ ఆయకట్టు పరిధిలో ఉండగా, మిగతా మండలాల్లో చెరువులు, ఇతర నీటి వనరుల ద్వారా సాగునీరు అందుతుంది. వేసవిలో ఈ కాలువ పనులు చేయడంతో చెరువులు, సాగర్ జలాలు రాగానే రైతులకు ఆ కాలువల ద్వారా చివరి భూముల వరకు నీరందేది. ప్రస్తుతం ఆ పనులను పక్కన పెట్టడంతో వచ్చే ఏడాది నుంచి అన్నదాతలకు సాగునీటి కష్టాలు తప్పవు.

**కాలువల పనులే ఎక్కువ**

అయిదేళ్ల నుంచి ఉపాధి హామీ పథకంలో సాగునీటి కాలువలు, నీటి సంరక్షణ పనులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ఏడాది సాగునీటి కాలువల పనులను ఎంపిక చేయలేదు. ఎక్కువ నిధులు వాటికే కేటాయించడం, చేసిన పనులే మళ్లీ మళ్లీ చేయడం వంటి కారణాలను చూపుతూ ఈ పనులను నిలిపివేశారు. ఈ పనులు ఒకసారి చేస్తే రెండేళ్ల వరకు అవసరం ఉండదని, నిధులు వృథా అవుతుందనేది ఉన్నతాధికారుల ఆలోచన. ఈ ఏడాది అధికంగా మట్టి తోలకాలు, రహదారులు, కుంటలు, రైతులకు వ్యక్తిగతంగా భూ అభివృద్ధి పనులు, పశువుల షెడ్లు, ఇతర జల సంరక్షణ పనులకు ప్రాధాన్యమిచ్చారు. ప్రతి ఏడాది గుర్తించే పనుల్లో 80 శాతం పనులు పంట కాలువలే ఉన్నాయి. కూలీలు ఈ పనులు చేయడానికి అధికంగా వచ్చేవారు. ఎక్కువ శ్రమ ఉండే పనులు ప్రస్తుతం గుర్తించడంతో వేసవిలో కూలీల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాలువ పనులు చేయడానికి గ్రామాల్లో కూలీలతోపాటు రైతులు సైతం అధిక సంఖ్యలో వచ్చేవారు. ప్రస్తుతం ఆ పనులను తొలగించడం, కొత్తగా పనులు గుర్తించకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లాలో ఇలా...**జాబ్ కార్డులు 3.06 లక్షలు

కల్పించనున్న పనిదినాలు 62.17 లక్షలు

చేయనున్న ఖర్చు రూ.86.28 కోట్లు

రైతులకు సంబంధించిన పనులే అధికంగా గుర్తించాం. భూ అభివృద్ధి, పంట కుంటలు, ఇతర జల సంరక్షణ పనులకు ప్రాధాన్యమిచ్చాం. పంట కాలువలను గుర్తించాలని ఎలాంటి సూచనలు రాలేదు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ముందుకు వెళ్తాం. అమ్మాజాన్, ఏపీఓ, కొణిజర్ల

# చదువుకు ఆదరువు

నల్గొండ: సర్కారు బడుల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో సకల వసతులతో బోధన, నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. విద్యావ్యవస్థ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది. ఇటీవలే అన్ని వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు ఒకే రకమైన రుచి, నాణ్యతతో కూడిన పౌష్టికాహారంతో కూడిన భోజనంను అమలు చేస్తున్నారు. ఈ ఏడాదిలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు వచ్చాయి.

**మెనూ ఛార్జీలు పెంపు.. సమకూరుతున్న వసతులు**

పదోతరగతి ఫలితాల్లో 2023 కంటే మూడు జిల్లాలు మెరుగైన స్థానాలు పొందింది. నల్గొండ జిల్లాలో అన్ని యజమాన్యాల పరిధిలో మొత్తం పాఠశాలలు 2,038 ఉండగా 2,29,374 మంది, సూర్యాపేట జిల్లాలో 1,303 పాఠశాలల్లో 1,49,693 మంది, యాదాద్రి జిల్లాలో 921 పాఠశాలలుండగా 1,16,396 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల నిర్వహణ కమిటీ(ఎస్ఎంసీ)ల స్థానంలో ఈ ప్రభుత్వం అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. మధ్యాహ్నభోజనం నాణ్యతగా వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నారు. అపరిష్కృత భవనాలను నిర్మించేలా ఈ కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. ఇటీవల గురుకులాలు, వసతిగృహ విద్యార్థులకు 40 శాతం వరకు మెనూ ఛార్జీలు పెంచారు. డీఎస్సీ ద్వారా నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 322 మంది, యాదాద్రిలో 169 పోస్టులు భర్తీ అయ్యా



యి. ఈ సంవత్సరం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 29 ప్రభుత్వ, ప్రయివేటు ఐటీఐ కళాశాలలుండగా కేవలం బాలికల ఐటీఐ కళాశాలలో బ్రిడ్జి కోర్సులు ఏర్పాటు చేశారు. కొత్త కోర్సులపై ఆశలు

యంగ్ఇండియాలో భాగంగా మూడు జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున సమీకృత గురుకుల పాఠశాలలు కేటాయించారు. పాలిటెక్నిక్‌లో చేరిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా కల్పించేందుకు బ్రిడ్జి కోర్సులు ప్రవేశపెట్టారు. సాంకేతిక పట్టభద్రులకు అపార ఉద్యోగావకాశాలను కల్పించేలా పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్సు టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)లుగా ఆధునికీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటీఐ, పాలిటెక్నిక్, ఏటీసీ కళాశాలను తీసుకువచ్చే విధంగా కార్యాచరణ సిద్ధమైంది. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై తత్సమాన కోర్సుల్లోనూ విద్యార్థులు ప్రత్యేక కోర్సుల్లో ప్రవేశాలు తీసుకునేందుకు ఆసక్తి కనబరిచారు. రానున్న సంవత్సరంలో మరిన్ని విద్యా సంస్కరణలు అమలు చేయాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# మళ్లీ రెవెన్యూ వ్యవస్థలోకి..

సూర్యాపేట : రెవెన్యూ వ్యవస్థలో జరిగే పరిణామాల దృష్ట్యా గత ప్రభుత్వం వీఆర్‌వోలను ఇతర శాఖల్లోకి బదిలీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న వీఆర్‌వోలు మున్సిపాలిటీ, ఎంపీడీవో, డీపీఆర్‌వో, డీఆర్డీవోలు, వ్యవసాయ, డీఈవోతోపాటు వివిధ శాఖల్లోకి మార్చారు. అప్పటి నుంచి ఆయా శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ప్రస్తుత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను తిరిగి బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపడుతోంది. అందులో భాగంగా భూ భారతి చట్టాన్ని పటిష్ఠం చేసేందుకు ముమ్మరంగా సన్నాహాలు చేపడుతోంది. గత ప్రభుత్వంలో వీఆర్‌వోలు, వీఆర్ఏలుగా పని చేసిన వారందరిని తిరిగి రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకునేందుకు సిద్ధమైంది. తొలుత వీఆర్‌వోలను విధుల్లోకి తీసుకునేందుకు కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామానికో వీఎల్‌వో నియామకానికి కసరత్తు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 73 మండలాలు, 1138 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో ఉమ్మడి నల్గొండలో 1015 వీఆర్‌వోలు, 61 సంవత్సరాల వీఆర్ఏల వారసులు 341 మంది వీఆర్ఏలు విధులు నిర్వర్తించారు. రెవెన్యూ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు గ్రామానికో గ్రామ స్థాయి అధికారులు (వీఎల్‌వో)ను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆసక్తి ఉన్న వీఆర్‌వోల వద్ద నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియను ఈ నెల 28 వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈ మేరకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఆ తరువాత వారిలో ప్రతిభ, అర్హతలు ఆధారంగా సర్వేయర్లుగా, వీఎల్‌వోలుగా నియమించనున్నారు. అనంతరం వీరికి భూ భారతి చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. భవిష్యత్తులో భూ సమస్యలు, పంచాయతీలకు ఎలాంటి ఘటనలు చేసుకోకుండా ప్రభుత్వం పటిష్ఠంగా చర్యలు తీసుకుంటోంది.

# సింగరేణి పనివేళల్లో మార్పు!

సింగరేణి : సింగరేణిలో పనివేళలు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అమలవుతున్న షిఫ్టుల కంటే సమయాన్ని మరింత సద్వినియోగం చేసుకోవడమే దీని ఉద్దేశం. భోజన విరామ సమయానికి ముందు, వెనుకగా పనివేళలు ప్రారంభం కావడం, లేదా ముగిసేలా షిఫ్టులను నిర్ణయించనున్నారు. సింగరేణిలో కార్మికులు ప్రధానంగా మూడు షిఫ్టులలో పనిచేస్తున్నారు. అవి.. ఉదయం 7–మధ్యాహ్నం 3, మధ్యాహ్నం 3–రాత్రి 11, రాత్రి 11–ఉదయం 7 గంటలు. మొదటి, రెండో షిఫ్ట్ కార్మికులకు మధ్యాహ్నం, రాత్రి భోజన విరామాన్ని గంటసేపు ఇవ్వాల్సి వస్తోంది. దీనికి బదులుగా ఆయా సమయాలను ఇంటి వద్దే పూర్తిచేసుకొనేలా కొత్తగా ప్రతిపాదనలు చేస్తున్నారు. దీనివల్ల సమయం ఆదా అవుతుందని, ఉత్పత్తి, ఉత్పాదకత మెరుగుపడుతుందని ఇటీవల సమావేశాలు నిర్వహించిన మల్టీడిపార్ట్‌మెంట్, రక్షణ కమిటీలు యాజమాన్యానికి తాజాగా సూచనలు చేశాయి. ప్రతిపాదిత సమయాలిలా షిఫ్ట్–1: ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుంది. ఆ తర్వాత భోజనానికి కార్మికులు ఇంటికెళ్తారు. షిఫ్ట్–2: మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుంది. ఈ షిఫ్ట్‌లో పనిచేసే వారు మధ్యాహ్న భోజనం ఇంటి వద్ద చేసి విధులకు వస్తారు. విధుల అనంతరం తిరిగి ఇంటికెళ్లి భోజనం చేస్తారు. షిఫ్ట్–3: రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు కొనసాగుతుంది. రాత్రి భోజనం చేసి విధులకు హాజరవుతారు.

“కోలిండియా, సింగరేణిలోని పలు ప్రైవేటు కంపెనీల తరహాలో కొత్తగా పని వేళలను మార్చాలనే ప్రతిపాదన ముందుకొచ్చింది. దీనిపై కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకుంటాం. ఆ తర్వాత పనివేళల మార్పు అమలును పరిశీలిస్తాం”.ఎన్.బలరాం, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

# ఇదేనా.. పుత్రోత్సాహం!

నల్గొండ : జిల్లా పెద్దవూర మండలంలో భార్యతో విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటున్న కుమారుడు తండ్రితో గొడవపడి, రాయితో తలపై కొట్టి నిర్దాక్షిణ్యంగా అంతమొందించాడు. నల్గొండ జిల్లా నిడమనూరులో నివాసముంటున్న దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె. పన్నెండేళ్ల క్రితమే కుమార్తెకు వివాహం జరిపించగా పిల్లలు లేరనే మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు విడిపోయారు. ఆమెకు రెండో వివాహం జరిగింది. ఆ పెళ్లికి తల్లిదండ్రుల మద్దతుందనే అనుమానంతో కుమారుడు కత్తితో కన్నతల్లి గొంతు కోసి, కడుపులో పొడవడంతో ఆమె ప్రాణాలు విడిచింది. ఇటీవల సూర్యాపేట జిల్లాలో ఓ వృద్ధుడి చేయి విరిగింది. తాను సంపాదించిన ఆస్తులు అనుభవిస్తున్న కుమారులు చికిత్స చేయించేందుకు ముందుకు రాలేదు. నొప్పిని భరించలేని ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు.

మీ జీవితంలో ఇద్దరు వ్యక్తులను మర్చిపోకండి.. నిన్ను గెలిపించడానికి సర్వస్వం కోల్పోయిన నాన్నను.. ప్రతి బాధలో మీతో ఉన్న అమ్మను.
అబ్దుల్ కలాం

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు పుట్టనేమి వాడు గిట్టనేమి..
పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా..
వేమన శతకంలోని నీతి పద్యం

అమ్మా..నాన్నలు ఆప్యాయతా సాగరం లాంటివారు. తీర్చుకోలేని నిస్వార్థ త్యాగాల రుణం వారిది. వారు లేకుంటే జన్మలేదు.. జీవితానికి వెలుగే లేదు. పస్తులుండైనా కన్న బిడ్డల కోసం కష్టాలు సహించే జీవన గమనం వారిది. అంత గొప్ప మనసున్న తల్లిదండ్రులకు పుత్రోత్సాహం లేకుండా చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు.

కళ్లు కనిపించని తల్లిదండ్రులను శ్రవణ కుమారుడు తన భుజాలపై మోసుకుంటూ వెళ్లి పుణ్యక్షేత్రాలు చూపించడం మనం పురాణాల్లో చదువుకున్నాం. అలాంటి నేలపై పుట్టిన మనలో కొందరు కన్నవారికి రాచి రంపాన పెడుతున్నారు. ఆయనలా భుజాలపై మోసుకెళ్లాలని మన తల్లిదండ్రులు చెప్పడం లేదు. చరమాంకంలో ఉన్నవారికి ఇంత కూడు, మంచి పలకరింపు ఇవే కోరుకుంటున్నారు. కానీ ఉమ్మడి జిల్లాలో వెలుగు చూస్తున్న ఘటనలు 'మాతృదేవోభవ.. పితృదేవోభవ' అన్న మాటల అర్థాలే మార్చేస్తున్నాయి. కొందరైతే వయసుడిగిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వేస్తున్నారు. కొడుతున్నారు.. చంపేస్తున్నారు. పాలు పట్టి..నీళ్లు పోసి..భుజాలకెత్తుకున్న చేతులు నేడు వారికి భారంగా పరిణమిస్తున్నాయి.

**ఎటు పోతున్నాం..**

మన తాతల నాటి కాలంలో కన్నవారిని కంటికి రెప్పలా చూసుకునే వారు. వారి అభిప్రాయాలకు ప్రాధాన్యమిచ్చేవారు. ఉమ్మడి కుటుంబాలు వారు చెప్పినట్లుగా నడుచుకునేవి. కొడుకులు, కోడళ్లు, మనువలు, మనువరాళ్లు వీరందరి మధ్య ఆనందంగా గడుపుతూ హాయిగా కన్నుమూసేవారు. నేడా పరిస్థితులేవీ..? చిన్నప్పటి నుంచి కంటికి రెప్పలా.. పిల్లల కోసం తన సంపా'ధన' జీవితం అన్నట్లుగా బతికిన నాన్న నేటి తరానికి భారమై పోతున్నాడు. మాకేం చేశావు.. ఏం సంపాదించావు..? అంటూ దూషిస్తున్నారు. మలిసంధ్యలో వారి పట్ల కుమారులు కిరాతకంగా వ్యవహరిస్తున్న ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్నాయి. మద్యానికి బానిసైన కొందరు కొడుకులైతే వారిని హత్య చేస్తున్నారు. సేవ చేసే సమయం లేని ఇంకొందరు వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న పరిస్థితులున్నాయి. పట్టించుకోవడం లేదని, ఆస్తిని కాజేశారని, దాడి చేశారని వృద్ధులు పోలీసులను ఆశ్రయించడం కలచి వేసే అంశమే. సమాజంలో రోజూ ఎక్కడో చోట అమ్మా..నాన్న కన్నీటిని దిగమింగుకుంటూనే ఉన్నారు.

**పంతం.. పెద్దాయన సొంతం..**

65ఏళ్లు దాటిన వారు తమ శక్తిని కోల్పోతారు. వారి ఆలోచనల్లో మార్పు వస్తుంది. ఇతరుల సాయం అవసరముంటుంది. వయసు పెరిగే కొద్దీ మొండిగా మారుతారు. ఇదే సమయంలో సంసార భారం మోస్తున్న వారి కుమారుల ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. దీంతో ఒకరి నిర్ణయాలతో ఒకరు ఏకీభవించలేరు. వారి పంతాలను నెగ్గించుకునే క్రమంలోనే గొడవలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగానే కుటుంబాల్లో చాలా వరకు గొడవలకు దారి తీస్తున్నాయి.

**ఇది కదా బాధ్యత..**

వృద్ధ తల్లిదండ్రుల స్థితిగతులకు అనుగుణంగా వారితో మాట్లాడాలి. వారి ఆరోగ్య, మానసిక స్థితిని అర్థం చేసుకొని ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి. ఏదైనా కోపంలో రెండు మాటలంటే కనిపెంచిన వారే కదా అని సరిపుచ్చుకోవాలి. వారి అవసరాలను గుర్తిస్తూ.. సమకూరుస్తూ.. ముందుకు సాగాలి. లోకం మెచ్చిన బిడ్డగా మీరూ ఎదగాలి.

ఇటీవల హెల్పేజ్ ఇండియా సంస్థ సర్వే ప్రకారం వృద్ధులను వేధిస్తున్న వారు (శాతాల్లో)

బంధువులు 36
కుమారులు 35
కోడళ్లు 21
ఇతరులు 8

ఉమ్మడి కుటుంబాల కనుమరుగుతోనే..
బోయపల్లి రాంశెట్టి, విశ్రాంత ప్రధానాచార్యులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాంపల్లి

# కొత్త వారికి మెప్మాలో చోటు

సూర్యాపేట : పట్టణాల్లో మహిళా సంఘంలో చేరని మహిళలకు మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) చర్యలు తీసుకుంటోంది. ప్రతి మహిళకు సభ్యత్వం కల్పించేందుకు రాష్ట్ర మెప్మాశాఖ ఆదేశాలు జారీచేసింది. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల పురపాలికలు ఉన్నాయి. ఈ ఐదు పురపాలికల్లో 5,325 సంఘాలుండగా మొత్తం 52,493 మంది సభ్యులు ఉన్నారు. వీరితోపాటు కొత్తగా మహిళలను సంఘంలో చేరుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

**సర్వే నిర్వహించి.. నమోదు చేయాలి** పట్టణంలో జనవరి చివరి వారం వరకు కొత్త వారికోసం సర్వే నిర్వహించి వారి వివరాలు అంతర్జాలంలో నమోదు చేయాలి. కాగా ఫిబ్రవరి మొదటి వారంలో వారితో సమావేశాలు నిర్వహించి గ్రూపులుగా విభజించాలి. వీరికితోడు ఇదివరకు సంఘంలో ఉండి వెళ్లిపోయిన వారిని కూడా గుర్తించి అవగాహన పర్చాలి. సంఘంలో సభ్యత్వం ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళాశక్తి పథకంలో రుణాలు ఇప్పించాలి. రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మెప్మా అధికారులు తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు18 ఏళ్లు నిండి పట్టణంలోని తెల్లరేషన్ కార్డుదారులు సంఘంలో అర్హులు. సంఘంలో చేరిన మహిళలు రుణాలు పొంది వ్యాపారంలో రాణించవచ్చు.సంఘంలో రుణం పొంది ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.10 లక్షలు, సాధారణ మరణమైతే రూ.2 లక్షల వరకు బీమా ఉంటుంది. సంఘంలో చేరిన తర్వాత వ్యక్తిగతంగా రూ.3.50 లక్షలు రుణం పొందేందుకు అర్హులు.

రుణాలు పొందడం, వ్యాపార నిర్వహణపై అధికారులు శిక్షణనిస్తారు.

# సిండికేట్ అయ్యారా? బిల్లులు జాప్యం అవుతాయనా?




హుస్నాబాద్: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో నిధులు మంజూరైన పనులకు టెండర్లు పిలవగా గుత్తేదార్లు ముందుకు రాలేదు. అధికారులు మరోసారి టెండర్లు పిలిచి జనవరి 3వ తేదీని గడువుగా నిర్ణయించారు. అధ్వాన స్థితిలో ఉన్న పంచాయతీ రాజ్ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. నవంబరులో నిర్వహించిన ఆన్‌లైన్ టెండరుకు ఎవరూ వేయలేదు. ఆసక్తి ఉన్న గుత్తేదార్లు టెండర్లు వేయడానికి గత నవంబరు 20 గడువు నిర్ణయించారు. ఆ గడువుకు ఎవరూ టెండరు వేయలేదు. ఇంజినీరింగు అధికారులు మళ్లీ నిర్వహిస్తున్నారు.

**కొత్త సంవత్సరంలో తేలేనా!**

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు లభించడమే గగనంగా ఉన్న పరిస్థితుల్లో పనులు చేపట్టేందుకు గుత్తేదార్లు ముందుకు రాకపోవడం గమనార్హం. గుత్తేదార్లు ముందుకు రాకపోవడానికి వివిధ కారణాలు ఉన్నాయనే భావన వ్యక్తం అవుతోంది. ఈ పనులు చేస్తే బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం కావచ్చని కొందరు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. మరోవైపు గుత్తేదార్లు సిండికేట్ కావడం వల్ల ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. టెండర్లలో పనులు చేపట్టడానికి గుత్తేదార్లు జిల్లాలను కేటాయించుకున్నట్లు సమాచారం. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పురపాలికల పనులను కేటాయించుకున్న విధంగా వారు మాత్రమే వేస్తున్నారు. ఈ పరిస్థితి కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఈ కారణంగానే ప్రస్తుతం దాఖలు కాలేదని చర్చించుకుంటున్నారు. ఈ విషయమై పీఆర్ డీఈఈ మహేశ్‌ను సంప్రదించగా టెండరు దశలో ఉన్నాయని తెలిపారు. జనవరిలో టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

పనులు జరగాల్సిన మండలాలు – 3
రహదారులు, వంతెనల పనులు – 16
మంజూరైన గ్రాంటు నిధులు – రూ.15.04 కోట్లు
5.5 కి.మీ. పందిల్ల–పొట్లపల్లి–హుస్నాబాద్ రెండు వరుసల రోడ్డు – రూ.3.95 కోట్లు
తోటపల్లి–పూసవర్లపల్లి మధ్య వంతెన – రూ.1.49 కోట్లు
కోహెడ–కూరెల్ల–తంగళ్లపల్లి చౌరస్తా – రూ.1.55 కోట్లు
తీగలకుంటపల్లి–శ్రీరాములపల్లి – రూ.1.50 కోట్లు
అక్కన్నపేట–సంజీవరాయ కాలనీ – రూ.1.40 కోట్లు
పీడబ్ల్యూడీ రోడ్డు, చౌటపల్లి, మల్లంపల్లి దారి పనులు – రూ.1 కోటి
జడ్పీ రోడ్డు, పరికిబండ మార్గం – రూ.50 లక్షలు
మూడు మండలాల్లో ఇతర పనులు – రూ.3.65 కోట్లు

# కేటగిరీ మార్పు.. కీలక తీర్పు



సిరిసిల్ల: జిల్లాలోని సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్)లో కేటగిరీలు మార్చి బిల్లులు నమోదు చేసిన వ్యవహారంలో హైకోర్టు తుది తీర్పు వెలువరించింది. దీంతో కేటగిరీ మార్చిన ఎస్ఎస్ఐ యూనిట్లు బిల్లుల చెల్లింపులు తప్పనిసరైంది. దీంతో వసూళ్లకు సెస్ అధికారులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 2016 తర్వాత మ్యాక్స్ సంఘాలకు సమానంగా ఎస్ఎస్ఐ యూనిట్లు పెరుగుతూ వచ్చాయి. మ్యాక్స్ సంఘాలు కుటీర పరిశ్రమలుగా కేటగిరీ–4లో యూనిట్‌కు రూ.4 ఉంటుంది. దీనికి ప్రభుత్వం యాభైశాతం రాయితీగా రూ.2 చెల్లిస్తుంది. అదే ఎస్ఎస్ఐ యూనిట్లు పరిశ్రమలుగా నమోదు కావడంతో కేటగిరీ–3లో యూనిట్‌కు రూ.7.70 కట్టాల్సి ఉంటుంది. దీనికి రాయితీ వర్తించదు. 2016 నుంచి క్రమంగా 127 ఎస్ఎస్ఐ యూనిట్లు ఏర్పడ్డాయి. వీటిని జిల్లా చేనేత, జౌళిశాఖ గుర్తించి సెస్‌కు పంపింది. ఈక్రమంలో 2022 వరకు ఎస్ఎస్ఐ యూనిట్లు కూడా కేటగిరీ–4లో యాభై శాతం రాయితీ పొందుతూ వస్తున్నాయి.

కేటగిరీలు మార్చి విద్యుత్తు వినియోగిస్తుండటంతో సెస్‌కు నష్టాలు వస్తున్నాయని సెస్ వినియోగదారుల సంక్షేమ మండలి 2022లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై సింగిల్ బెంచ్ 2023 ఫిబ్రవరిలో ఎస్ఎస్ఐ యూనిట్లకు కేటగిరీ–3లోనే బిల్లులు వసూలు చేయాలని తీర్పునిచ్చింది. ఆరేళ్లుగా రాయితీ పొందుతున్న వారంతా అయోమయంలో పడ్డారు.

జిల్లా వస్త్ర పరిశ్రమకు మాత్రమే వర్తించేలా చూడాలని అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఇలా చేస్తే దీనిని ఆసరాగా తీసుకొని రాష్ట్రంలో ఇతర రంగాల్లోని ఎస్ఎస్ఐ యూనిట్లు కూడా ఇదే కోవలోకి వస్తాయి. అప్పుడు ఆయా శాఖలకు విద్యుత్తు రాయితీల రూపంలో వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. ఇది ఆయా శాఖలకు భారంగా మారుతుందని వీరి వినతిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో వీరంతా హైకోర్టులోని డివిజన్ బెంచ్‌ని ఆశ్రయించారు. పలు వాదనల తర్వాత 2025 జనవరి 29న ఎస్ఎస్ఐ యూనిట్లు కేటగిరీ–3లోనే బిల్లులు చెల్లించాలని తీర్పునిచ్చింది.

**స్పష్టమైన ఆదేశాలు**

జిల్లా వస్త్ర పరిశ్రమలో రాయితీ విద్యుత్తు వినియోగంపై చేనేత జౌళిశాఖ 2024 మేలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మ్యాక్స్ సంఘాల్లోని సభ్యులకు మాత్రమే యాభైశాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొంటూ సెస్ ఎండీకి ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఒకే ప్రాంగణంలోని మరమగ్గాల్లో పది హెచ్‌పీ (హార్స్ పవర్) విద్యుత్తు వాడితే అది కుటీర పరిశ్రమ (కాటేజ్ ఇండస్ట్రీస్) పరిధిలో రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఈ రాయితీని 25 హెచ్‌పీకి పెంచాలని కోరుతూ పరిశ్రమ వర్గాలు ప్రభుత్వానికి విన్నవించాయి. దానికి స్పందించిన చేనేత, జౌళిశాఖ ఇటీవలే 25 హెచ్‌పీకి పెంచింది.

**రూ.32 కోట్లకు చేరిన బకాయిలు**

కుటీర పరిశ్రమలుగా చూపించి ఎస్ఎస్ఐ యూనిట్లు 2023 వరకు వాడిన విద్యుత్తుకు సెస్‌కు రూ.20.34 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీటిని చెల్లించకపోవడంతో ఆ బిల్లులపై ప్రతి నెలా సర్‌ఛార్జీల రూపంలో 18 శాతం అదనంగా జమవుతూ వస్తోంది. దీంతో ఇప్పటికి రూ.32 కోట్లకు చేరింది. ఇప్పటికే పెండింగ్ బిల్లులతో సతమతమవుతున్న సెస్ వీటి చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సిబ్బందిని సన్నద్ధం చేస్తోంది.

# అల్పాహారం.. పోషక మిళితం



సిరిసిల్ల : సర్కారు బడిలో చదివే పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు రెండు గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మూడు నెలల క్రితమే తరగతులు మొదలు కాగా సాయంత్రం వరకు పాఠశాలల్లో ఆకలితో చదవాల్సి వస్తుంది. ఈ పరిస్థితులకు స్వస్తి పలికేందుకు అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు మేలు చేకూరనుంది. జిల్లాలోని పదమూడు మండలాల పరిధిలోని ప్రైవేటు, ప్రభుత్వ రంగ విద్యాలయాల్లో 6,890 మంది విద్యార్థులు చదువుతున్నారు. గురుకులాలు, కస్తూర్బా, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందుతుంది. అయితే ఉన్నత, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు 3,638 మందికి ఎలాంటి అల్పాహారం అందడం లేదు. అక్కడక్కడ దాతలు సమకూర్చిన నిధులతో అందిస్తున్నారు. లేనిచోట ఆకలితో ఉంటున్నారు. ఇతర గ్రామాల నుంచి దగ్గరలోని పాఠశాలకు వచ్చే వారు ఇంటికి చేరుకునేలోపు రాత్రి అవుతుంది.

**పోషక విలువలతో...**విద్యార్థులకు సాయంత్రం పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించనున్నారు. మార్చి 21 నుంచి వార్షిక పరీక్షలు ఉండగా, ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు 38 పని దినాల్లో స్నాక్స్ ఇవ్వనున్నారు. ఇందుకోసం రోజుకు రూ. 15 చొప్పున 38 రోజులకు ఒక్కో విద్యార్థికి రూ. 570 ఖర్చు చేయనున్నారు. దీనికోసం రూ. 20.73 లక్షలు అవసరమవుతాయని అంచనా వేశారు. ఉడికించిన పెసర్లు, బబ్బర్లు, శనగలు, పల్లీలు–బెల్లం, చిరుధాన్యాల బిస్కెట్లు, ఉల్లి పకోడి అందిస్తారు. ఉదయం పూట కూడా ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని తయారు చేసే బాధ్యత మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు అప్పగించనున్నారు.

ఇంటి దగ్గర తినకుండా..– పులి స్పందన, పదో తరగతి, కంచర్ల
నేను అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వీర్నపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్నాను. బస్సు ముందుగానే రావడంతో ఇంటి దగ్గర ఏమీ తినలేకపోతున్నా.

రెండు పూటలా పెట్టాలి – నునావత్ గణేశ్, వీర్నపల్లి
వ్యవసాయ పనులకు వెళ్లే అమ్మానాన్నలు పొద్దున్న అల్పాహారం తయారు చేసి ఇవ్వలేరు. ఖాళీ కడుపుతోనే బడికి వస్తుంటాం. ఒంట్లో సత్తువ ఉండట్లేదు. ఉదయం కూడా ఇవ్వాలి.

# ప్రకృతి వనాలా.. అడవులా..?

కారేపల్లి : గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 'పల్లె ప్రకృతి వనాల'ను ఏర్పాటు చేసింది. తొలుత స్థలాల కొరత ఏర్పడినా.. అందుబాటులో ఉన్న స్థలాల్లోనే మొక్కలను నాటించారు. గత ప్రభుత్వ హయాం వరకు వాటి నిర్వహణను స్థానిక పాలకవర్గాలు, అధికారం యంత్రాంగం ఎలాగోలా నెట్టుకొచ్చింది. గత రెండేళ్లుగా ఆయా వనాల వైపు కన్నెత్తి చూసిన నాథుడు లేడు. కొన్నిచోట్ల వనాలు ఎండి.. ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది. మరికొన్ని ప్రదేశాల్లో రక్షణ కంచెల్లేక పశువుల సంచరిస్తున్నాయి.

**రూ.కోట్ల ప్రజాధనం వృథా**

ప్రకృతి వనాలకు లభ్యతను బట్టి అరెకరం నుంచి పదెకరాల వరకు స్థలాలు కేటాయించారు. చిన్నవాటిల్లో 2–4 వేలు, పెద్ద వనాల్లో



సుమారు 20 వేల మొక్కలు నాటించారు. ఇందుకోసం రూ.2–6 లక్షల వరకు నిధులను ప్రభుత్వం వెచ్చించింది. వాటి నిర్వహణకు సంబంధించి కూలీల ఖర్చులను ఉపాధి హామీ పథకం ద్వారా మళ్లించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, గత రెండేళ్లుగా వనాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా దాదాపు ఇదే పరిస్థితి.

కారేపల్లి మండలంలోని తులిస్యాతండాలో ఏర్పాటు చేసిన వనాల్లో పట్టుమని పది మొక్కలు కనిపించడం లేదు. ఇక్కడి నర్సరీకి సూచిక బోర్డు మాత్రమే మిగిలింది.

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నారాయణపురం వనంలో గడ్డిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఒకప్పటి వనం ఇప్పుడు చిట్టడవిని తలపిస్తోంది. భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలం మైలారంలోని ప్రకృతి వనం నర్సరీలో మొక్కలన్నీ ఎండిపోయాయి. పినపాక మండలం సీతారాంపురంలో అటవీ ప్రాంతంలోనే వనాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో అక్కడి మొక్కలు చనిపోయాయి. ఉమ్మడి జిలాలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యత ఆయా పంచాయతీలతో పాటు మండల స్థాయి అధికారులపై ఉంది. నిబంధనల ప్రకారం ఎంపీడీవో, ఏపీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు వనాల సంరక్షణను పట్టించుకోవాలి. నిర్వహణ సక్రమంగా లేనిచోట పరిశీలించి.. క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడతాం. వనాల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి, ఖమ్మం

# రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం భళా..!

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిల్లో ఖమ్మం కార్యాలయం నుంచే ప్రభుత్వానికి గణనీయ ఆదాయం లభిస్తుంది. గతేడాది రాబడి మరింత పెరగడం విశేషం. వివరాల్లోకి వెళ్తే.. 2024లో ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 13,526 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. వీటి ద్వారా రూ.99.51 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు 2023లో 14,078 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినా.. రూ.96.82 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ఖమ్మం జిల్లాలో 7, భద్రాద్రి కొత్తగూడెం



జిల్లాలో 4 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రభుత్వానికి లభించే ఆదాయంలో మొత్తం 11 కార్యాలయాల్లో ఒక్క ఖమ్మం నుంచే 50 శాతం వరకు వస్తుంది. మిగతా పది కార్యాలయాలూ కలిసి ఖమ్మం ఆదాయంతో పోటీ పడుతుంటాయి.

**ఎన్నికలతో మందగించినా..**

2024లో పార్లమెంటు ఎన్నికలు నిర్వహించగా ఎన్నికల కోడ్, ఇతర కారణాలతో సుమారు ఆర్నెల్లు స్థిరాస్తి వ్యాపారం మందగించింది. ఎన్నికలు ముగిసిన తర్వాత స్థిరాస్తుల క్రయ, విక్రయ లావాదేవీలు కొంత పెరిగాయి. దీంతో ఖమ్మంలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పెరిగింది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలలు ఉందని, క్రయ, విక్రయ లావాదేవీలు పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

# 44 గ్రామాలు.. 42,000 ఎకరాలు

కొత్తగూడెం : 'రైతు భరోసా' పథకం కింద పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేస్తోంది. సాగయ్యే పొలాలకే పథకం వర్తింపజేసే యోచనలో ఉంది. అర్హుల నిర్ధారణకు శాటిలైట్ సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని తొలుత భావించింది. ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వెల్లడికావడంతో మండలానికో గ్రామం చొప్పున పంటల నమోదు(క్రాప్ బుకింగ్)కు శ్రీకారం చుట్టింది. యాప్‌లో నమోదు చేసే ఆయా వివరాలను, 'శాటిలైట్ సర్వే'తో సరిపోల్చాలన్నది యోచన. దీని ప్రకారం 8వ తేదీలోగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మొత్తం 44 గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో విస్తరణాధికారు(ఏఈవో)లు పంటల నమోదు ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది.

సర్వే ఇలా.. ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే నంబరు, దాని పరిధిలోని మొత్తం విస్తీర్ణం, ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఏఏ పంటలు సాగుచేశారు? అనే వివరాలను ఏఈవోలు నమోదు చేస్తారు.

సర్వేకు సంబంధించిన యాప్ అందుబాటులోకి వచ్చిన అనంతరం, క్షేత్రస్థాయిలో పంటల వివరాలు విధి విధానాల ప్రకారం నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉమ్మడి జిల్లాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

సోమవారం నుంచి మూడ్రోజుల పాటు పైలెట్ గ్రామాల్లో సర్వే జరిగే అవకాశముంది.

'మండలానికో గ్రామం చొప్పున సాగు భూముల పూర్తి వివరాలను నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశించింది. దీనికనుగుణంగా పైలెట్ గ్రామాలను ఎంపిక చేశాం. మూడ్రోజుల్లోగా ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకుంటాం'. బాబురావు, జిల్లా వ్యవసాయాధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# మారాలి మనం.. కేరళలా..!

సూర్యాపేట : ఈ తరుణంలో దేశంలోనే అక్షరాస్యతలో మొదటి స్థానంలో ఉన్న కేరళ అనుసరిస్తున్న విధానాలతోనే సర్కారు పాఠశాలలు బలోపేతం చేయవచ్చని విద్యారంగ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల వారు సైతం పట్టణాలకు బస్సుల్లో తమ పిల్లల్ని పంపుతుండగా సంఖ్య తగ్గిపోతుంది. మరోవైపు గురుకులాలు, కేజీబీవీ, మైనార్టీ విద్యా సంస్థల్లో పోటీ పరీక్షలు రాసి నిరుపేద విద్యార్థులు చేరుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య ఏటా తగ్గిపోతోంది.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది భువనగిరి జిల్లా వ్యాప్తంగా 3,151 మంది విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో తగ్గిపోయింది.

సూర్యాపేట జిల్లాలో గతేడాదితో పోల్చితే ఈ విద్యా సంవత్సరం 4,522 మంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

కేరళ విద్యారంగం విధానాలు మచ్చుకు కొన్ని...

దేశంలోనే మొదటిసారి 2007లో ఈ సూచనలను కేరళ వంద శాతం అమలు చేసి విజయం సాధించింది.

20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించారు.

5 కిలోమీటర్లను యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేశారు. అన్ని వసతులు, తరగతి గదులు కల్పించారు.




కేరళలో 40వేల జనాభా దాటిన చోట ఒక్క ప్రైవేట్ పాఠశాలకు మాత్రమే అనుమతిని ఇస్తున్నారు. ఐదంచెల విధానంలో తనిఖీ చేసిన తరువాతే ప్రైవేట్ పాఠశాలకు అనుమతి ఇస్తూ పూర్తిగా నియంత్రించారు. కేరళలో 80 శాతం ప్రభుత్వ పాఠశాలలు, 10 శాతం మిషనరీ, ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉండగా కేవలం 10 శాతం మాత్రమే ప్రైవేట్ పాఠశాలలున్నాయి.

'తల్లిదండ్రులు, టీచర్స్ అసోసియేషన్' ఏర్పాటు చేసి..వారికి పూర్తి అధికారాలు ఇచ్చారు. ప్రతి 2 నెలలకు సమావేశం ఏర్పాటు చేసుకుని పాఠశాల అభివృద్ధిపై నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తారు.

ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ తమ నిధులలో 50 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకే ఖర్చుచేయాల్సి ఉంటుంది.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డీఈవోకు ఉండే అధికారాలు కల్పించారు. క్రమశిక్షణ పాటించని ఉపాధ్యాయులను సస్పెన్షన్‌తో పాటు సర్వీసు నుంచి తొలగించే అధికారాలు ఉంటాయి.

జాతీయ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) 2005లో విద్యారంగ ప్రమాణాల పెంపునకు గాను 2005 జాతీయ పాఠ్యపుస్తకాల నిర్ణయ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఆయా రాష్ట్రాలలో పూర్తి అధ్యయనం తరువాత ప్రాంతీయ భాషకు, మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని, సామాజిక స్థితిగతులు, స్థానిక పరిస్థితులను పాఠ్యాంశాలలో చేర్చాలని సూచించారు. దీన్ని అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆదేశించారు.

# సమీకృతం.. సగం సగం..!

నల్గొండ : పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం అటకెక్కింది. గత ప్రభుత్వం కూరగాయలు, మాంసాహారం తదితరాలు అన్నీ ఒకేచోట విక్రయాలు జరగాలని భావించి సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట, నల్గొండ మినహా అంతటా పనులు పడకేశాయి. పునాదులకే పరిమితమయ్యాయి. కేటాయించిన నిధులు కూడా మంజూరు కాక నిర్మాణం కలగానే మారింది. పూర్తయిన రెండు చోట్ల ఉత్సవ విగ్రహాలుగా మారాయి. రూ.కోట్లు కేటాయించినా నిష్ఫలం కావడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆరుబయటే విక్రయాలు**

సూర్యాపేటలో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.30.18 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. గతేడాది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు వ్యాపారులు అక్కడ విక్రయాలు చేపట్టడం లేదు. ఆరుబయటనే తమ క్రయవిక్రయాలు చేపడుతున్నారు.

**నల్గొండలో నిరుపయోగంగా..**

నల్గొండలో రూ.8 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ నిరుపయోగంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు వ్యాపారులకు దుకాణాలు కేటాయించలేదు.

**అదనపు నిధులు మంజూరైనా..**

చిట్యాలలో ఇన్‌గ్రాంట్ బడ్జెట్ కింద 2021లో రూ.2 కోట్ల అంచనాతో సమీకృత మార్కెట్ పనులు ప్రారంభించారు. డిజైన్ మాత్రం రూ.5 కోట్లకు రూపొందించారు. అదనంగా రూ.3 కోట్ల నిధులు మంజూరైనా గుత్తేదారుతో అదనపు నిధుల పనుల ఒప్పందం జరగలేదు. ఈలోపు ఎన్నికల ప్రకటన వెలువడటంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం స్లాబ్‌ల వరకు పనులు జరిగాయి.

నకిరేకల్‌లో రూ.2 కోట్లతో ప్రారంభించి రెండు స్లాబుల వరకు పనులు జరిగాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. పనుల్లో జాప్యం కారణంగా గుత్తేదారును మార్చి మరొకరికి అప్పగించినా ముందుకు సాగటం లేదు.

దేవరకొండలో రూ.4.5 కోట్లు మంజూరవగా స్థల సమస్యతో కొంతకాలం వాయిదా పడింది. ప్రస్తుతం అంచనా విలువ రూ.11 కోట్లకు పెంచారు. గుత్తేదారు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

హాలియాలో రూ.2 కోట్లతో పనులు చేపట్టగా స్లాబ్ వరకు నిర్మించారు. అంచనా వ్యయం రూ.5 కోట్లకు పెంచారు. పనులు నిలిచిపోయాయి.

**బిల్లులు అందక.. పనులు సాగక**

చండూరులో పిల్లర్ల దశ వరకే నిర్మించారు. దీని నిర్మాణానికి రూ. 2 కోట్లు కేటాయించారు. మిగతా పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి.

మిర్యాలగూడలో రూ.1.20 కోట్లతో చేపట్టగా అసంపూర్తిగానే ఉంది. ఇక్కడ కూడా నిధులు సరిపడక పనులు ముందుకు సాగటం లేదు.

భువనగిరిలో రూ.8.40 కోట్ల అంచనాతో చేపట్టగా నిధుల కొరత కారణంగా నిర్మాణం ముందుకుసాగటం లేదు.

ఆలేరు, యాదగిరిగుట్ట పురపాలికలలో ఒక్కో దానికి రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు.

**రాకపోకలకు ఇబ్బంది...**

సమీకృత మార్కెట్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రధాన రోడ్లు, సంతల్లో అమ్మకాలు చేపడుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వాహనాలు రావడంతో దారి మళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకూ పట్టణాల్లో జనసందడి పెరగడంతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది.

# జల దోపిడీకి అడ్డుకట్ట ఏదీ!




పెద్దపల్లి : ప్రకృతి సంపద అయిన నీటిని పారిశ్రామిక అవసరాలకు విచ్చలవిడిగా తోడేస్తున్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యంతో జలాలు వృథా అవుతున్నాయి. ఇంకుడుగుంతల తవ్వకాల నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. కలుషిత నీరు జనావాసాల్లోకి చేరడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. పరిశ్రమల్లో అవసరానికి మించి నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం రెండేళ్ల కిందట చేపట్టిన 'వాటర్ ఫ్లో మీటర్' విధానం అటకెక్కింది. ప్రతి పరిశ్రమ నిర్వాహకులు తప్పనిసరిగా మీటరు బిగించుకోవాలన్న నిబంధనలు పాటించడం లేదు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినా ఫలితం కనిపించడం లేదు.

**సమన్వయ లోపం**

కర్మాగారాల్లో నీటి వినియోగంపై పర్యవేక్షణ కొరవడింది. ప్రతి పరిశ్రమకు వాటర్ ఫ్లో మీటర్ బిగించాలనే నిబంధన అమలు కావడం లేదు. రెవెన్యూ, పోలీసు, భూగర్భ జల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా సమన్వయ లోపం కనిపిస్తోంది. మూడు నెలలకోసారి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించాల్సిన సమీక్షల ఊసే లేదు. నీటి వినియోగంపై నిఘా పెట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. పరిశ్రమల నిర్వాహకులకు అవగాహన కల్పించినా మీటర్ల ఏర్పాటుకు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. మీటర్ల ఏర్పాటుపై కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖకు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది.

**నోటీసులు జారీ చేసినా అంతే..**

ఉమ్మడి జిల్లాలో ఎన్టీపీసీ, బొగ్గు, సౌర విద్యుత్తు, గ్రానైట్, వాటర్ ప్లాంట్లు, బాయిల్డ్ రైస్ మిల్లులు, క్రషర్లు, ఇతర పరిశ్రమలున్నాయి. వీటిలో నిత్యం లక్షల లీటర్ల నీరు వృథా అవుతోంది. కొందరు అడ్డదారిలో నీటి అనుమతులు పొందుతున్నారనే విమర్శలున్నాయి. ఎన్ని బోర్లు, ఎన్ని లీటర్ల అవసరం వంటి అంశాలకు సంబంధించి తప్పుడు అంచనాతో దరఖాస్తు చేసుకుంటున్నారు. మరికొందరు అనుమతి లేకుండా బోర్లు తవ్వుతున్నారు. మీటర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ భూగర్భ జల శాఖ అధికారులు పలుమార్లు నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే అదనపు ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని తప్పించుకుంటున్నారు. ఈ విషయంలో భూగర్భ జల శాఖకు మిగిలిన శాఖలు సహకరించడం లేదు.

**అధిక వినియోగానికి అదనపు ఛార్జీలు**

పరిశ్రమకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసే సమయంలో ఎంత నీటిని వినియోగించనున్నారో కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది.

నిబంధనలు పట్టించుకోకుంటే పరిశ్రమకు సంబంధించిన బోరును ప్రభుత్వం సీజ్ చేయాల్సి ఉంటుంది.

పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలతో పరిసర ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

నీటిని అధికంగా వినియోగిస్తే ప్రభుత్వానికి అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

మీటర్లు లేకుంటే అనుమతి రద్దు

–లావణ్య, భూగర్భ జలవనరుల శాఖ అధికారి, పెద్దపల్లి

ప్రతి పరిశ్రమలో వాటర్ ఫ్లో మీటర్ తప్పనిసరిగా బిగించాలి. ఈ విషయమై యాజమాన్యాలకు అవగాహన కల్పించనున్నాం. వృథా నీటిని అరికట్టేందుకు ఇంకుడు గుంతలు తవ్వుకోవాలి. తనిఖీల్లో బోర్లకు మీటర్లు లేకుంటే అనుమతి రద్దు చేస్తాం. కంపెనీలకు నోటీసులు జారీ చేస్తున్నాం.

ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు

గ్రానైట్: 139

బిల్డింగ్ స్టోన్: 126

రైస్ మిల్లులు: 294

భారీ పరిశ్రమలు: 59

వాటర్ ప్లాంట్లు: 221 టీఎస్ ఐపాస్ పరిశ్రమలు: 1,368

# నిర్వాసితుల దారిపై నిర్లక్ష్యపు వరద



మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాసకాలనీ వరకు రహదారిపై ఎప్పుడూ నీరు పారుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉపరితల గని విస్తరణ కోసం రచ్చపల్లిలో భూములు, ఇళ్లు సేకరించిన సింగరేణి యాజమాన్యం నిర్వాసితుల కోసం పునరావాస కాలనీ నిర్మించింది. అక్కడి వరకు వేసిన తారు రోడ్డును ఆర్అండ్‌బీకి గాని, పంచాయతీరాజ్ శాఖకు గాని అప్పగించడం లేదు. దీంతో మరమ్మతుకు, విస్తరణకు నోచుకోవడం లేదు. కేవలం 2 కిలోమీటర్ల దూరం రోడ్డుపై దాదాపు ఎనిమిది చోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. దారిపై అడుగడుగునా గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

**ఏడాదిలో తొమ్మిది నెలలు నీళ్లే**

సూరయ్యపల్లి-రచ్చపల్లి రహదారి పల్లపు ప్రాంతంలో ఉండటం, పక్కన పొలాలు ఎత్తులో ఉన్నాయి. దీంతో జనగలంత వాగు కాలువ నీటితో పాటు బిట్టుపల్లి పెద్దచెరువు జలాలు పొలాల మీదుగా ప్రవహించడంతో ఏడాదిలో తొమ్మిది నెలల పాటు రహదారిపై నీరు పారుతోంది. రహదారిపై గుంతలు, రాళ్లు, పాకురుతో వాహనాలు జారి ప్రమాదానికి గురవుతున్నాయి. కల్వర్టు నిర్మాణంతో పాటు రోడ్డును రెండు వరుసలుగా విస్తరిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

గతంలో ఈ ప్రాంత వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మట్టి దారి ఉండేది. పదేళ్ల కిందట సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులో అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ నిర్వాసితుల కోసం పునరావాస కాలనీ నిర్మించింది. రూ.2 కోట్ల వ్యయంతో ఒక వరుస తారు రోడ్డు నిర్మించారు. గతంలో రోజుకు దాదాపు 20 వాహనాలు రాకపోకలు సాగించేవి.

ఈ మార్గంలో మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లెలపల్లి గ్రామాల ప్రజలు ప్రయాణిస్తారు.

ఏడాది కిందట ఖమ్మంపల్లి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన అందుబాటులోకి రావడంతో రోజుకు వెయ్యి వాహనాలు నడుస్తున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి–సదానందం, రచ్చపల్లి

రహదారిపై పారుతున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలి. గుంతలు, పాకురుతో వాహనాలు పట్టు తప్పుతున్నాయి. నీరు పారే ప్రదేశంలో కల్వర్టు నిర్మించాలి.

విస్తరణపై స్పందన కరవైంది–నాగరాజు, రచ్చపల్లి

అసలే మలుపులు, గుంతలతో ఇబ్బందులు ఎదురవుతుండగా నీరు నిలుస్తుండటంతో మరిన్ని అవస్థలు పడుతున్నాం. రహదారి విస్తరణపై సింగరేణి అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు.

# అర్ధాకలి చదువులకు స్వస్తి

కరీంనగర్ : పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ముందుకొచ్చింది. మెరుగైన ఫలితాల సాధనకు గత నవంబరు నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. తాజాగా ఆ విద్యార్థుల ఆకలి తీర్చేందుకు స్నాక్స్ అందించేందుకు నిర్ణయం తీసుకుంది. అన్ని ప్రభుత్వ, ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకూ ఆదేశాలు జారీ చేసింది. సాయంత్రం జరిగే స్టడీ అవర్స్‌కు హాజరయ్యే ఒక్కో విద్యార్థికి నిత్యం స్నాక్స్ కోసం రూ.15 ఖర్చు చేయాలని సూచించింది. ఇందుకయ్యే ఖర్చులను ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో త్వరలో వేయనుంది.


**13,741 మందికి..**

మార్చిలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉదయం ప్రార్థనకు ముందు, సాయంత్రం బడి ముగిశాక గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఉదయం ఖాళీ కడుపులతో, సాయంత్రం ఆకలితో హాజరవుతున్నారు. స్నాక్స్ అందించాలని విద్యార్థులే కోరినా.. ఇప్పటి వరకు ప్రభుత్వం, దాతలు స్పందించలేదు.

ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 20వ తేదీ వరకు సాయంత్రం వేళ స్నాక్స్ అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ముందుకు రావడంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 13,741 విద్యార్థుల ఆకలి తీరనుంది. 38 రోజులు అందించే మొత్తం ఈ స్నాక్స్ కోసం ఉమ్మడి జిల్లాకు రూ.73,32,370 మంజూరు చేశారు. స్నాక్స్ మధ్యాహ్న భోజనం నిర్వాహకులే సమకూర్చాలని పేర్కొనడం, వాటి తయారీకి అదనంగా డబ్బులు ఇవ్వకపోవడంపై స్పష్టత లేని కారణంగా దీని అమలుపై ఉపాధ్యాయుల్లో సంశయం నెలకొంది.

# కంచెలు తెంచి.. హద్దులు చెరిపి

హైదరాబాద్ : ప్రభుత్వ భూములకు సరిహద్దులు.. కంచెలు.. జియోట్యాగింగ్‌లు లేకపోవడంతో కొందరు అక్రమార్కులు వాటిని చెరిపేసి ప్రైవేటు పట్టాభూముల ఖాతాల్లోకి మార్చుకుంటున్నారు. ఈ దందా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కువగా సాగుతోంది. ధరణి పోర్టల్‌లోని లోపాలతో కొందరు రియల్ సంస్థల ప్రతినిధులు, వ్యక్తులు ఇప్పటికే రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు చెరపట్టారు. ఈ వ్యవహారానికి అడ్డుకట్ట వేస్తామని అధికారులు ప్రకటించినా...ఇప్పటి వరకూ ఎక్కడా సర్వే చేయలేదు.



ఆక్రమణ ఇక్కడే.. : రంగారెడ్డి జిల్లాలో సుమారు 500 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 300 ఎకరాలను ఆక్రమించుకున్నారని విశ్వసనీయంగా తెలుస్తోంది.

**పేరుకే డిజిటల్ సర్వేలు**

పహాణీలు, రెవెన్యూ రికార్డులు, ధరణి పోర్టల్‌లో ప్రభుత్వ భూముల వివరాలున్నా... వీటిల్లో చాలావరకూ నవీకరణ చేయలేదు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ భూముల్లో కొన్నింటిని హెచ్ఎండీఏకు, ఐటీ, పరిశ్రమలశాఖలకు కేటాయించారు. వీటితో పాటు కొన్ని ధార్మిక సంస్థలు, కుల సంఘాల కార్యకలాపాలకు ప్రభుత్వ భూములను అప్పటి ప్రభుత్వం ఇచ్చేసింది. మిగిలిన ప్రభుత్వ భూములను డిజిటల్ సర్వే ద్వారా గుర్తిస్తామని, జియోట్యాగింగ్ చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. డిజిటల్ సర్వేనే కాదు..అసలు సర్వేచేయడానికి సర్వేయర్లు రెండు జిల్లాల్లోనూ లేరు.

**రికార్డులు సరిగా లేక..**

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని చాలామందికి తమ భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొందరు అక్రమార్కులు రెవెన్యూ విభాగంలోని కిందిస్థాయి సిబ్బందితో కలిసి తప్పుడు రికార్డులు సృష్టించి కోర్టుకెళ్తున్నారు. ఇటీవలే గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. అయినా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూ రికార్డులను సరి చూడటం లేదు.

# ఆపదలో అతివలకు ఆర్థిక వరం

తాండూరు : బషీరాబాద్ మండలానికి చెందిన ఓ మహిళ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అయితే ఆమె మండల కేంద్రంలోని బ్యాంకులో రూ.లక్షకుపైగా రుణం తీసుకుంది. ఇంకా కొంత చెల్లించాల్సి ఉండగా...తాజాగా రుణ బీమా పథకం వర్తింపుతో మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే మాఫీ చేస్తోంది. మర్పల్లి మండలానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు కొన్ని నెలల క్రితం మరణించింది. మహిళా సంఘం ఆధ్వర్యంలో రూ.80వేల అప్పు తీసుకుంది. సగం చెల్లించగా.. మిగతా మొత్తాన్ని కట్టాల్సిన పని లేకుండా పోయింది. ఎందుకంటే ఆమెకు రుణ బీమా పథకం వర్తిస్తోంది. అతివల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు తీసుకున్న రుణానికి బీమా సౌకర్యాన్ని కొత్తగా అమలు చేయడంతో



సభ్యురాలి కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. రుణం తీసుకున్న సభ్యురాలు సాధారణ మరణం లేదా ప్రమాదంలో మరణిస్తే పక్షం రోజుల్లోగా అధికారులు బ్యాంకులకు ఆ మొత్తం చెల్లించే విధంగా ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

**జిల్లాలో 53 మంది..**జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మహిళా సంఘాల సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత, సంఘ రుణాలతో పాటు వ్యాపార పురోగతికి రుణాలను అందిస్తున్నారు. 2024 మార్చి 14వ తేదీ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సహజ, ప్రమాద మరణాలు కలిపి మొత్తం 53 మంది ఉన్నారు. ఇవి సమర్పించాల్సి ఉంటుంది..: మరణించిన సభ్యురాలి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, సంఘంలో సభ్యురాలేనని వీఓ ధ్రువపత్రం, రుణం తీసుకున్న బ్యాంకు ఖాతా, మరణించిన నాటికి ఎంత రుణం ఉందనే బ్యాంకు వివరాలు, తదితరాలు. మహిళా సంఘం అధ్యక్షుల నుంచి వీఓ, సీసీ, ఏపీఓ పూర్తి వివరాల దస్త్రాలను సమర్పిస్తే రుణ బీమా నగదు బ్యాంకు అప్పు ఖాతాకు, ప్రమాద బీమా నగదు సభ్యురాలు కుటుంబ సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ డీపీఎం నర్సింహులు'కు వివరించారు.

# ఎంఎన్‌జే వైద్యశాలకు జవసత్వాలు

హైదరాబాద్: ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి జవసత్వాలు రానున్నాయి. కొత్తగా 47 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ పూర్తికానుంది. కొత్త సంవత్సరం నుంచి వీరంతా విధుల్లో చేరనున్నారు. దీంతో క్యాన్సర్ రోగులకు మరింత నాణ్యమైన చికిత్సలు అందించేందుకు ఆస్కారం కలగనుంది. తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల నుంచి ఎంఎన్‌జేకు నిత్యం క్యాన్సర్ రోగుల తాకిడి ఉంటోంది. ఇక్కడ అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలు ఉచితంగా అందిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితమైన రోబోట్ చికిత్సలను కూడా ఎంఎన్‌జేలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం 150 వరకు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. మరో 50 పీజీలు, కాంట్రాక్టు వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఏటా రోగుల సంఖ్య పెరుగుతోంది. కొత్తగా రానున్న వైద్యులతో ఇబ్బందులు తీరనున్నాయి.

# వీధికి వదిలేశారు

హైదరాబాద్ : సాక్షాత్తు.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలోని పలు రహదారుల్లో వీధిలైట్లు లేకపోవడంతో నెలక్రితం 100కుపైగా స్తంభాలను ఏర్పాటు చేయగా.. ఇప్పటి వరకు వాటికి లైట్లను అమర్చలేదు. ఎప్పుడు బిగిస్తారని ఇంజినీర్లను అడిగితే.. నేడో.. రేపో అంటూ జీహెచ్ఎంసీ కాలక్షేపం చేస్తోంది. ఇక సామాన్యుల ఫిర్యాదుల గురించి వేరే చెప్పనక్కర్లేదు. వేలాది ఫిర్యాదులు నెల రోజులుగా పరిష్కారానికి నోచుకోవట్లేదు. కొత్త స్తంభాలకు లైట్లను అమర్చే గుత్తేదారులు, పాడైపోయిన లైట్ల స్థానంలో కొత్త వాటిని అమర్చే కాంట్రాక్టర్లు నెల రోజులుగా ధర్నాలో ఉండటమే కారణం.



**గుత్తేదారుల సమస్య ఏంటంటే..**

నగరంలో ఎల్ఈడీ లైట్లను అమర్చి, వాటిని రోజూ 98శాతం వెలిగిస్తామంటూ ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) సంస్థ ఏడేళ్ల కాలానికి జీహెచ్ఎంసీతో ఒప్పందం చేసుకుంది. సదరు సంస్థ కాంట్రాక్టు గడువు ఏప్రిల్, 2025తో ముగియనుంది. నిబంధనలు ఉల్లంఘించడంతో కొన్ని నెలలుగా ఆ సంస్థకు బిల్లుల చెల్లింపు నిలిపినట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. మరోవైపు ఈఈఎస్ఎల్ ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంది. దాంతో.. సర్కిళ్ల వారీగా లైట్ల నిర్వహణ చూసే గుత్తేదారులకూ చెల్లింపులు నిలిచాయి. వారు నెల రోజులుగా ధర్నా చేస్తున్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ రూ.150కోట్ల మేర చెల్లించాల్సి ఉందని ఈఈఎస్ఎల్ చెబుతోంది. మరోవైపు సదరు సంస్థతో ఒప్పందాన్ని పొడిగించుకునే అవకాశాలను జీహెచ్ఎంసీ అటకెక్కించడంతో సమస్య తీవ్రంగా మారింది.

**నిత్యం వెయ్యి ఫిర్యాదులు**

నగరంలో 5.48లక్షల ఎల్ఈడీ వీధిలైట్లు ఉన్నాయి. నిర్మానుష్య ప్రాంతాల్లో మరో పది వేల లైట్లు అవసరం. రోజూ వీధిలైట్లు వెలగట్లేదంటూ సగటున వెయ్యి ఫిర్యాదులు వస్తుంటాయి. నెల రోజులుగా ఆయా సమస్యల్లో ఒక్కటీ పరిష్కారం కాలేదు. కొత్త బల్బులు ఏర్పాటు చేసేందుకు సిబ్బంది లేరని అధికారులు ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండటం ఆందోళనకు అద్దం పడుతోంది.

# పొగబండ్లపై కొరడా

హైదరాబాద్ : మహానగరంలో కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలకు చెక్ పెట్టాలని రవాణా, పోలీసు శాఖలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటి వరకు ట్రాఫిక్ ఉల్లంఘనలపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారు. కేవలం పెండింగులో ఉన్న చలానాల కోసమే పోలీసులు వాహన తనిఖీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆ శాఖలో పోస్టులను భర్తీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసు, రవాణా శాఖ అధికారులు వాహన తనిఖీల్లో పెండింగు బకాయిలే కాకుండా బీమా, కాలుష్య స్థాయులను నిర్ధారించే ధ్రువపత్రాల పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ట్రాఫిక్ చలానాల వసూలుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని పోలీసు శాఖ ఇటీవల అమలు చేసింది. ఇక కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలపై దృష్టి సారించాలని



నిర్ణయించారు.

**కాలుష్య తనిఖీ పత్రాలు అనివార్యం..**

రవాణా శాఖ నిబంధనల మేరకు వాహనాలను ఆరు నెలలకోసారి కాలుష్య తనిఖీలు చేయించాలి. వాటి ధ్రువపత్రాలను వాహనాల్లో అందుబాటులో ఉంచుకోవాలి. తనిఖీ సందర్భంగా వాహనం కాలుష్య స్థాయులు రవాణా శాఖ సర్వర్‌తోపాటు ఆర్టీఏ ఎం వ్యాలెట్‌లోనూ నమోదు అవుతాయి. తనిఖీ సమయంలో ఆర్టీఏ ఎం వ్యాలెట్లోని కాలుష్య ధ్రువపత్రాన్ని చూపినా సరిపోతుంది. వాహనాల తనిఖీలు అంతంత మాత్రంగా ఉండటంతో వాటి విషయంలో దృష్టి సారించిన దాఖలాలు లేవు. ప్రమాదాలకు గురైన సందర్భాల్లోనే తనిఖీ చేస్తున్నారు. భవిష్యత్తులో అన్ని ధ్రువపత్రాలను పరిశీలించాలని నిర్ణయించారు. త్వరలో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తరువాత ఆ ప్రక్రియను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు ఓ అధికారి వివరించారు.

# అత్యున్నత ప్రమాణాలతో మురుగు శుద్ధి

హైదరాబాద్ : హైదరాబాద్‌లో మురుగునీటి శుద్ధిలో అత్యున్నత ప్రమాణాల నిర్వహణ నేపథ్యంలో పకడ్బందీ పర్యవేక్షణ విధానానికి జలమండలి శ్రీకారం చుడుతోంది. హైదరాబాద్, చుట్టుపక్కల ఇప్పటి వరకు 36 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) అందుబాటులోకి రాగా మరో 9 ఎస్టీపీల పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్టీపీలో మురుగునీటి శుద్ధి ప్రమాణాల మేరకు ఉండేలా జలమండలి ఆన్‌లైన్ కంటిన్యూ ఎఫులియెంట్ మోనటరింగ్ సిస్టమ్ (ఓసీఈఎంఎస్)ను అమలు చేయనుంది. ఎస్టీపీలో జలమండలి కొన్నింటిని నిర్వహిస్తుండగా మరికొన్నింటిని హైబ్రీడ్ యాన్యూటీ విధానంలో ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్నాయి. తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించుకునే ప్రమాణాల మేరకు శుద్ధి చేసిన జలాలు ఉండాలి. ప్రధాన కార్యాలయం నుంచి ప్రతి ఎస్టీపీని పర్యవేక్షించనున్నారు. ఎంత మురుగునీరు ఎస్టీపీలో వస్తోంది? ఎంత శుద్ధి అవుతోంది? నాణ్యత ఎలా ఉంది? అనేది 24 గంటలు పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. **సీపీసీబీ నిర్దేశించినట్లు ఉండాలని..**మూసీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఎస్టీపీల్లో శుద్ధి అయ్యే మురుగునీరు కూడా నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఉండాలనేది జలమండలి లక్ష్యం. శుద్ధి కేంద్రాల్లో బీఓడీ, సీఓడీ, పీహెచ్‌ఏలు కేంద్ర కాలుష్య నియంత్రణ (సీపీసీబీ) మండలి నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఉండాలి. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు భౌతికంగా తనిఖీలు చేసి శుద్ధి అయిన మురుగునీటి ప్రమాణాలను గుర్తించడం అన్ని వేళలా సాధ్యం కాని పరిస్థితుల నేపథ్యంలో కొత్త పర్యవేక్షణ విధానం మెరుగైన ఫలితాలు ఇస్తుందని వివరించారు.

# నేవీ ప్రాజెక్టు.. వడివడిగా ముందుకు



పూడూరు : దాదాపు పదిహేనేళ్ల ప్రతిపాదన.. మారిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. న్యాయస్థానంలో కేసులు. ప్రజా ఉద్యమాలు.. ఇలా అనేక ఒడిదుడుకులను అధిగమించి జిల్లాకు దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.. పూడూరు మండలం, దామగుండం నేవీ ప్రాజెక్టు. గత అక్టోబరులో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇతర ప్రముఖుల సమక్షంలో ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాప జరిగింది. ఇక్కడ ఏర్పాటయ్యే టవర్లతో సముద్రంలో నడిచే జలాంతర్గాములు, ఓడలకు సంకేతాలు అందుతాయి. దేశంలోనే ఇది రెండో ప్రాజెక్టు. 2027 నాటికి పూర్తి చేయాలనేది కేంద్ర లక్ష్యం. ఇందుకు అనుగుణంగా పలు నిర్మాణాలు వడివడిగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**అనువైన ప్రదేశం కావడంతో ఎంపిక**

దామగుండం అటవీ ప్రాంతం ఎత్తయిన ప్రదేశంలో ఉందని భావించిన నేవీ అధికారులు ప్రాజెక్టు ఏర్పాటుకు 2009లో ఆసక్తి చూపారు. వివిధ అనుమతులు పొందిన అనంతరం ఇటీవల ప్రభుత్వం 2,900 ఎకరాలను అప్పగించింది. ఇక్కడ పనిచేసే సిబ్బంది నివాస గృహాలు, కార్యాలయం, పాఠశాల, ఆసుపత్రి, మార్కెట్, టవర్ల ఏర్పాటు, పార్కులు, రహదారులు వంటివి ఎక్కడ చేపట్టాలని ఇంజినీర్ల బృందంతో పరిశీలించి నమూనా (మ్యాప్) తయారు చేశారు. దాని ప్రకారం అయ్యే వ్యయం కేంద్రం భరిస్తుంది. ముందుగా రూ.2,500 కోట్లను మంజూరు చేసింది.

**మరోచోట నాటిస్తున్నాం**

దామగుండం అడవిలో నిర్మాణాలు జరిగే ప్రదేశంలో చెట్లను తొలగించాల్సి రావటంతో మరోచోట నాటిస్తున్నాం. ఎక్కడ చెట్లు కొట్టేయాలన్నా ముందస్తుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఆలయానికి వచ్చిపోయే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అరుణ, అటవీశాఖ పర్యవేక్షకురాలు, వికారాబాద్.

**ఆలయమూ వారి పరిధిలోకే..**

అడవిలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. ప్రాజెక్టు దేశభద్రతకు సంబంధించింది కావటంతో ఆలయం ఇక నేవీ ఆధీనంలో ఉంటుంది. ఆలయానికి వచ్చిన భక్తులు నేవీ వారు ఏర్పాటుచేసే గేటు నుంచి ప్రవేశం పొంది తిరిగి రావటం తప్ప ఎటూ వెళ్లలేని విధంగా ఉంటుంది.

చురుకుగా పనులు: దామగుండంలో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం వైజాగ్ ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. దీంతో ఇప్పటికే అడవి చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం కందకాలు తీస్తున్నారు. భారీ టవర్లు ఏర్పాటు చేయనున్న తిర్మలాపూర్ ప్రాంతంలో చెట్లను తొలగిస్తున్నారు.

# కర్రసాముతో ధైర్య సాహసం



సిరిసిల్ల : కర్రసాము ఒక విలక్షణ ఆత్మరక్షణ విద్య. దీనిని నేర్చుకోవడం ద్వారా ఎంతటి సవాళ్లను అయినా అధిగమించే సామర్థ్యం వస్తుంది. పురాతన విద్య నేడు అధునాతన హంగులతో ముందుకు వచ్చింది. నేటి కాలంలో సవాళ్లను అధిగమించే సామర్థ్యాన్ని మహిళల్లో కల్పించేందుకు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఉచితంగా శిక్షణ అందిస్తోంది. దీంతో చిన్నారులు మొదలుకొని మహిళల వరకు నేర్చుకుని ఊహించని పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోగలమన్న ధైర్యాన్ని పొందుతున్నారు.

**ధైర్యం కోసం...**కోడం లహరి, గృహిణి

గతంలో నేను బయటకు రావడానికే భయంగా అనిపించేది. కర్రసాము శిక్షణ పొందిన తర్వాత ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎవరూ తోడు లేకుండానే షాపింగ్‌కు వెళ్తున్నాను. మార్కెట్‌కు వెళ్లి నిత్యావసర వస్తువులు తీసుకొస్తున్నాను. శిక్షణ నాకు ఎంతో ధైర్యాన్ని నింపింది.

**మహిళలందరూ నేర్చుకోవాలి**దాసరి తిరుమల, న్యాయవాది

సిరిసిల్ల పట్టణంలోని మహిళలందరూ కర్రసాము నేర్చుకోవాలి. రక్షణ చట్టాలు కఠినంగా మారినా నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు జరుగుతున్నాయి. ప్రతి మహిళా కర్రసాము శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ధైర్యంగా ఉండాలి.

**విద్యార్థి దశలోనే నేర్పించాలి**కనుకుంట్ల సంజన, జూనియర్ డాక్టర్

సమాజంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయి. అఘాయిత్యాల నుంచి రక్షించుకునేందుకు కర్రసాము శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా పాఠశాల నుంచి మొదలుకొని యువతులు, మహిళల వరకు నిత్యం ఏదో ఓ ప్రాంతంలో దాడులు చోటుచేసుకుంటున్నాయి. వాటి నుంచి రక్షణ పొందడానికి విద్యార్థి దశలోనే కర్రసాము నేర్పించాలి. బాలికలకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

**ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది**అలువాల ఈశ్వర్, హెల్పింగ్ హార్ట్స్, అధ్యక్షుడు

పురాతన విద్య నేడు అధునాతన హంగులతో ముందుకు వచ్చింది. నేటి ఆధునిక కాలంలోని సవాళ్లను అధిగమించే సామర్థ్యాన్ని పొందవచ్చు. హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటి వరకు సుమారు 200 మంది చిన్నారులు, యువతులు, మహిళలు నేర్చుకున్నారు.

**కాలనీ పిల్లలకు నేర్పుతున్నా...**సాదల తేజప్రియ, డిగ్రీ విద్యార్థిని

ఆడపిల్లలకు రోజు రోజుకు రక్షణ లేకుండా పోతుంది. ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతున్నాయి. ఎవరికి వారే తమ రక్షణను చూసుకోవాలి. చట్టాలు, పోలీసు వ్యవస్థ స్పందన కోసం చూస్తే నష్టపోయేది మనమే అన్న ఉద్దేశంతో స్వీయ రక్షణకు కర్రసాము నేర్చుకున్నాను. ఇంటి వద్ద కాలనీ పిల్లలకు కూడా నేర్పిస్తున్నాను.

**మంచి విద్య** కౌసల్య, బ్యూటీషియన్

నన్ను నేను రక్షించుకోవడమే కాదు ఇతరులకు కూడా కర్రసాము శిక్షణ నేర్పాలనే లక్ష్యంతో నేర్చుకున్నాను. ఇది పురాతన విద్య అయినా మంచిది. నేర్చుకోవడంతో నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# హైలెవల్ వంతెన నిర్మాణమెప్పుడో?



వేములవాడ : అధికారులు బదిలీ అవుతున్నారు. ప్రజాప్రతినిధులు మారుతున్నారు. అయినా పైవంతెన నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. నిధులున్నా నిర్లక్ష్యం వీడటం లేదు. భూమిపూజ చేసి ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం మొదలు కాకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మరోవైపు ఏటా భారీ వర్షాలకు కాలువ పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయి ఈ ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో కట్టు కాలువపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రెండున్నరేళ్ల క్రితం రూ.2.5 కోట్లు మంజూరయ్యాయి. ఏడాదిన్నర క్రితం భూమిపూజ చేసినప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు ఆగిపోయాయి. పైవంతెన నిర్మాణానికి భూమిపూజ చేయడంతో ఏటా పడే కష్టాలు తీరుతాయని ఈ ప్రాంతీయులు సంబరపడ్డారు. వంతెన నిర్మాణం కాకపోవడంతో దాదాపు అయిదు గ్రామాల ప్రజలతోపాటు వేములవాడ నుంచి నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు రవాణా సౌకర్యం ప్రతి వర్షాకాలంలో నిలిచిపోయి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డులో పైవంతెన నిర్మాణంలో జాప్యం పట్ల స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది.

**ఎక్కడి వారు అక్కడే...**మల్లారం రోడ్డులోని కట్టు కాలువలోకి వర్షం నీటితో పాటు పంట పొలాల నుంచి వచ్చే వరద చేరుతుంది. దీంతో ఈ కాలువ వర్షాకాలంలో భారీ ఎత్తున పారుతుంది. వాగుకు ఇరువైపులా వాహనదారులు ఎక్కడి వారు అక్కడే నిలిచిపోవాల్సి వస్తుంది. కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం, మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాలతో పాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలు, మరోవైపు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఏటా వర్షాకాలంలో కల్వర్టు వద్ద పైపుల నుంచి వెళ్లే నీరు కాకుండా భారీగా వరద పైనుంచి పారడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. భారీ వర్షం కురిస్తే భీమేశ్వర కాలువ నీటితో పాటు వ్యవసాయ పంట పొలాల నుంచి భారీగా వరద ఈ కాలువలోకి చేరుతుంది. దీంతో రవాణా స్తంభించిపోయి ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైవంతెన నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. **తిరిగి టెండర్ల నిర్వహణకు ఆదేశాలు**

వేములవాడ శివారు మల్లారం రోడ్డులోని కాలువపై హైలెవల్ వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తయినప్పటికీ గుత్తేదారు పనులు చేపట్టడం లేదు. దీంతో ఆ టెండర్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించి పనులు చేపట్టేందుకు ఇప్పటికే ఆర్అండ్ బీ అధికారులకు ఆదేశాలివ్వడం జరిగింది. త్వరలోనే వంతెన నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేములవాడ

# ముందుకు సాగని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల పనులు

శంషాబాద్ : ఔటర్ రింగ్‌రోడ్డుకు సంబంధించి సర్వీస్ రహదారుల నిర్మాణ పనులు ఏళ్ల తరబడి ముందుకు సాగడం లేదు. ఈ పనులు పూర్తి చేసే బాధ్యత తమది కాదని హెచ్ఎండీఏ అధికారులు చేతులెత్తేస్తున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి ఔటర్ కూడలికి అనుసంధానంగా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్ల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. మొదటి దశలో 2006లో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి తొండుపల్లి శివారు వరకు 21 కి.మీ. మార్గాన్ని చేపట్టారు. తొండుపల్లి కూడలికి అనుసంధానంగా నిర్మించాల్సిన సర్వీస్ రహదారుల పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.



**వెనుదిరుగుతున్న వాహనాలు..**

గచ్చిబౌలి నుంచి సర్వీస్ రోడ్ల మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్తున్న వాహనదారులు తొండుపల్లి కూడలి వద్దకు రాగానే రోడ్లు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వరంగల్, విజయవాడ వైపు నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి సర్వీస్ రోడ్ల మీదుగా వస్తున్న వాహనాలు హమీదుల్లానగర్ వద్ద రోడ్లు కనిపించక పోవడంతో వెనుదిరగాల్సి వస్తోంది. రాత్రి సమయంలో ఈ రహదారులపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవుటర్ రింగ్ రోడ్డును వ్యవసాయ పంట పొలాల మీదుగా నిర్మించడంతో శివారు గ్రామాల అనుబంధ రహదారులు తెగిపోయాయి. స్థానికులకు మెరుగైన రవాణా సదుపాయం ఉండేలా అవుటర్‌కు ఇరువైపులా విశాలమైన సర్వీస్ రోడ్లను నిర్మించారు. శంషాబాద్‌లో సర్వీస్ రహదారుల నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు. హమీదుల్లా నగర్, పోశెట్టిగూడ గ్రామస్థులు 3-4 కి.మీ. దూరంలో ఉన్న శంషాబాద్‌కు వచ్చేందుకు తొండుపల్లి మీదుగా 6 కి.మీ.ప్రయాణించాల్సి వస్తోంది. మొదటి దశలో చేపట్టిన తొండుపల్లి, పోశెట్టిగూడ ప్రాంతాల్లో ఆగిపోయిన ఒకటిన్నర కి.మీ. మార్గంలో సర్వీస్ రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఊపందుకోని యాసంగి సాగు

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో అక్టోబరు 1 నుంచి యాసంగి సీజను మొదలైనా ఇప్పటి వరకు పైర్లసాగు నెమ్మదిగానే ఉన్నట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. కరీంనగర్ జిల్లాలో అన్ని పంటల సాగు విస్తీర్ణం 18 శాతం, పెద్దపల్లి 16, జగిత్యాల 31, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 26 శాతంగానే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలను ఇవ్వకపోవటంతో రైతులు వరివైపే మొగ్గుతున్నారు. ఇప్పటికే వరినార్లు పోసిన రైతులు నాట్లను ప్రారంభించారు. దొడ్డుగింజ రకాలను అధిక విస్తీర్ణంలో నార్లు పోయగా ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్‌ను ఇస్తామనటంతో యాసంగిలోనూ కొందరు రైతులు సన్నగింజ వరిరకాలను సాగుచేస్తున్నారు.



మరికొందరు రైతులు వరిలో సంకర, సూటిరకాల్లో విత్తనోత్పత్తి చేపట్టారు. ఆరుతడి పంటలుగా మక్క, ఆవాలు, పెసర, మినుము, వేరుసెనగ, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, సెనగ వంటి పంటలను విత్తుకోగా జనవరిలో నువ్వులు, కూరగాయలు, పెసర, మినుము తదితర పంటల సాగుకు అదనుంది. మరోవైపు భూగర్భ జలలభ్యతతో పాటుగా ఈ నెల 25 తేదీ నుంచి.. జనవరి 2వ తేదీ నుంచి జోన్ల వారీగా ఆయకట్టుకు నీటితడుల ప్రణాళికను అమలు చేయనుండటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముంది.

# ఆధ్యాత్మిక పర్యాటకం

వేములవాడ : కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో పర్యాటక స్ఫూర్తి పరిఢవిల్లుతోంది.. ఆధ్యాత్మిక క్షేత్రాలకు రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకుల తాకిడి పెరుగుతోంది.. ప్రజా రవాణా వ్యవస్థతోపాటు వ్యక్తిగత రవాణా వాహనాల సౌకర్యం పెరగడంతో పర్యాటకులు పెరుగుతున్నారు.. శ్రావణ మాసంతోపాటు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం పర్యాటకులు పెరగడానికి కారణమని తెలుస్తోంది.. పర్యాటక శాఖ తాజాగా వెల్లడించిన లెక్కల ప్రకారం ఎక్కువ మంది పర్యాటకులు వచ్చినరాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో, జగిత్యాల అయిదో స్థానంలో నిలిచాయి..

**ప్రత్యేకత ఇలా..**

ఈ ఏడాది 8 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రదేశాలకు 6.51 కోట్ల మంది వెళ్లగా.. అందులో రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చినవారే 1.27 కోట్ల వరకున్నారు. మొత్తం పర్యాటకుల్లో మన వద్దకు వచ్చిన వారే దాదాపు 20 శాతం. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం ఉండటం రాజన్న సిరిసిల్ల జిల్లాకు.. కొండగట్టు, ధర్మపురి దేవస్థానాలుండటం జగిత్యాల జిల్లాకు పర్యాటకులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

వచ్చిన పర్యాటకుల్లో 62 శాతం మహిళలున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వీరికి కలిసొచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఉమ్మడి జిల్లాకు వచ్చిన పర్యాటకుల సంఖ్య దాదాపుగా మూడింతలకు చేరువైంది. **కోటిన్నర మందికిపైగా...**ఇప్పటికే ఈ ఏడాదిలో కోటిన్నరకుపైగా సందర్శకులు ఉమ్మడి జిల్లాకు విచ్చేశారు. 2024 సంవత్సరంలో ఆగస్టు వరకు ఉమ్మడి జిల్లాకు ఏకంగా 1,64,53,235 మంది వచ్చారు. ఈ ఏడాది నెలకు సగటున 20 లక్షలకుపైగా వస్తున్నారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో మరో 80 లక్షల మంది నాలుగు జిల్లాలకు వచ్చే వీలుంది. దీన్ని బట్టి ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో దాదాపుగా రెండున్నర కోట్ల మంది ఇక్కడి ప్రదేశాలను వీక్షించేందుకు వచ్చినట్లవుతుంది. గతేడాది జనవరి నుంచి ఆగస్టు వరకు వచ్చిన వారు 65.76 లక్షలు ఉండగా ఈ సారి అదే ఎనిమిది నెలల వ్యవధిలో 1.64 కోట్ల మంది ఉమ్మడి జిల్లాకు రావడం విశేషం.




# కుంభమేళా తొక్కిసలాట ఘటనపై సుప్రీం

దిల్లీ: కుంభమేళా తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని, ఆందోళన కలిగించే విషయమని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అయితే ఈ ఘటనకు సంబంధించి ఉత్తర్‌ప్రదేశ్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ, దేశవ్యాప్తంగా వచ్చే భక్తుల భద్రత విషయంలో ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిల్‌ను తిరస్కరించింది. దీనిపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. %ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ విశాల్ తివారీ అనే న్యాయవాది ఇటీవల సుప్రీంలో పిల్ వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధానపరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అందులో కోరారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా వీఐపీల కదలికలను ఆపాలని పిటిషన్‌లో ప్రస్తావించారు. దీనిపై యూపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈ ఘటనపై జ్యుడీషియల్ దర్యాప్తు జరుగుతోందని, ఇదేతరహాలో ఓ పిల్ హైకోర్టులో దాఖలైందని సుప్రీంకు తెలియజేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తాజా ఆదేశాలు ఇచ్చింది.

## ఏపీ చాలా నష్టపోయింది.. గట్టెక్కించాలి: అరవింద్ పనగడియాను కోరిన చంద్రబాబు

దిల్లీ: 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియాతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. దిల్లీలో సుమారు 2 గంటల పాటు సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలను పనగడియా దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో రంగాల వారీగా జరిగిన నష్టంపై చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ఆయన వివరించారు. "దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీకి తక్కువ జీడీపీ ఉంది. ఐదేళ్ల దుష్పరిపాలనతో రాష్ట్రం చాలా నష్టపోయింది. ఏపీ ఆర్థిక స్థితి దారుణంగా ఉందని.. అప్పులు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నీతిఆయోగ్ చెప్పింది. గత ఐదేళ్లలో రూ.10లక్షల కోట్ల అప్పులు తెచ్చారు. రూ.లక్షన్నర కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ఆర్థికంగా గట్టెక్కించే చర్యలకు సహకరించాలి"అని అరవింద్ పనగడియాను చంద్రబాబు కోరారు.






అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబును నటుడు, 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు సోనూసూద్ సోమవారం అమరావతిలోని సచివాలయం లో కలిశారు.

ఏపీ ప్రభుత్వానికి సోనూసూద్ ఫౌండేషన్ నాలుగు అంబులెన్స్‌లను అందించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన సోనూసూద్.. ఫౌండే షన్ అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. అనంతరం నాలుగు అంబులెన్స్‌లను సీఎం ప్రారంభించారు. మర్యాద పూర్వకంగా తనను కలవడానికి వచ్చిన సోనూసూద్‌ను ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు.

ఆరోగ్య సంరక్షణలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' భాగస్వామి అయినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# సినీనిర్మాత కేపీ చౌదరి ఆత్మహత్య

హైదరాబాద్: సినీ నిర్మాత కేపీ చౌదరి గోవాలో ఇవాళ (సోమవారం) ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో డ్రగ్స్ కేసులో కేపీ చౌదరి అరెస్ట్ అయ్యాడు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో డ్రగ్స్ కేసులో కేపీ చౌదరిని నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. వరలక్ష్మి టిఫిన్ డ్రగ్స్ కేసులో నిందితుడుగా కేపీ చౌదరి ఉన్నారు. చాలామంది సినీ సెలబ్రిటీలకు డ్రగ్స్ అందజేసినట్లు గతంలో ఆరోపణలు వచ్చాయి. ఆర్థిక ఇబ్బందులు అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసు లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే, డ్రగ్స్ కేసులో సినీ నిర్మాత కేపీ చౌదరిని గతంలో రాజేంద్రనగర్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నా రు. గోవా నుంచి మాదక ద్రవ్యాలను తరలిస్తూ పోలీసులకు చౌదరి పట్టుపడ్డారు. గోవా నుంచి 100 ప్యాకెట్ల కొకైన్ తీసుకు రాగా.. 90 ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో 10 ప్యాకెట్లు



ఎవరికి అమ్మారన్న విషయంపై పోలీసుల దర్యాప్తు చేశారు. సినీ నిర్మాత కేపీ చౌదరి అరెస్ట్‌తో సినీ డ్రగ్స్ లింక్స్ తెర మీదకు వచ్చాయి. కేపీ చౌదరి అరెస్ట్‌తో పలువురు సెలబ్రిటీల్లో టెన్షన్ పడ్డారు.

## ఎమ్మార్పీఎస్ ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదు: మందకృష్ణ మాదిగ




హైదరాబాద్: 30 ఏళ్లలో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెప్పుల తయారీ, డప్పు వాయిద్యం తమకు వారసత్వంగా వచ్చాయన్నారు. తమ మూలాలు కాపాడుకునేందుకు త్వరలో సాంస్కృతిక కార్యక్రమం చేపడతామని చెప్పారు. "ఎమ్మార్పీఎస్ ఉద్యమం 1994లో మొదలుపెట్టాం. 1996 మార్చిలో మొట్టమొదటి బహిరంగసభ నిర్వహించాం. ఉద్యమ విస్తరణ కోసం మొదటి రెండేళ్లు పనిచేశాం. వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించాం. లక్షల మందిని సమీకరించినా ఎప్పుడూ సమస్య రాలేదు. ఎమ్మార్పీఎస్ ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదు. అలా చేస్తే ఇన్నేళ్లు ఉద్యమం నిలబడేది కాదు. అస్తిత్వం కోసమే మా సాంస్కృతిక ప్రదర్శన. దీనికి అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందనడం అన్యాయం. ఆరు అంశాలు చూపుతూ అనుమతి నిరాకరిస్తూ నోటీసులు ఇచ్చారు. దానికి వివరణ ఇస్తూ మరో వినతిపత్రం ఇస్తాం. గాంధేయ మార్గంలోనే ప్రయాణం కొనసాగిస్తాం. లక్ష డప్పులు, వేయి గొంతుకల కార్యక్రమానికి సీఎం అనుమతి ఇవ్వాలి. ఫిబ్రవరి 7న కార్యక్రమం అనుమతికి మరోసారి వినతిపత్రం ఇస్తాం. గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా కార్యక్రమం ఉండబోతోంది." అని మందకృష్ణ మాదిగ అన్నారు.




రైళ్లకు సంబంధించిన అన్ని సేవలూ ఒకేచోట అందించే ఓ సూపర్ యాప్‌ను భారతీయ రైల్వే తాజాగా అందుబాటులోకి తెచ్చింది. స్వరైల్ పేరిట దీన్ని లాంచ్ చేసింది. అయితే, దీన్ని అందరూ వాడలేరు. ఎందుకంటే ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. పరిమిత సంఖ్యలో యూజర్లు మాత్రమే వాడేందుకు వీలుంటుంది. కాబట్టి అందరూ దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవడం కుదరదు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై వెయ్యి మంది చొప్పున తొలుత రైల్వేశాఖ ఈ అవకాశం కల్పించింది. దీంతో ఇప్పటికే బీటా టెస్టింగ్ ఎంచుకున్న వారి సంఖ్య పూర్తయ్యిందని ఈ యాప్‌ను రూపొందించిన సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తెలిపింది. బీటా టెస్టర్ల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా మార్పులు, చేర్పులతో పౌరులకు ఈ యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు. అంటే మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందే. బీటా టెస్టర్ల సంఖ్యను ముమ్మందు పెంచినా మీరు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక ఈ యాప్ ఫీచర్లను చూస్తే.. రిజర్వ్ టికెట్లతో పాటు, అన్‌రిజర్వుడు టికెట్లను కూడా ఈ ప్లాట్‌ఫామ్‌పై బుక్ చేసుకోవచ్చు. పార్సిల్, సరకు రవాణా వంటి సేవలనూ పొందొచ్చు. పీఎన్‌ఆర్ స్టేటస్‌ను చెక్ చేయడంతో పాటు, రైల్లోకి ఫుడ్ ఆర్డర్ చేసుకోవచ్చు. రైల్వేకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే వాటినీ ఇందులోనే పొందుపరిచే వీలుంటుంది. ప్రస్తుతానికి ఈ సేవలన్నీ ఆన్‌లైన్‌లో, యాప్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. అయితే, ఒక్కో సేవకు ఒక్కో యాప్ ఉంది. వీటన్నింటినీ ఒకేచోట అందించడమే ఈ సూపర్ యాప్ లక్ష్యం. ముమ్మందు మరిన్ని సేవలను ఇందులో జోడించే అవకాశం ఉంది.




దిల్లీ: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 10, 12వ తరగతి పరీక్షలకు అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షల అడ్మిట్ కార్డుల్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పరీక్షలకు సన్నద్ధమైన విద్యార్థులు సీబీఎస్ఈ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయిన తర్వాత విద్యార్థులు/ఆయా పాఠశాలలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా దాదాపు 44లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థుల ఈ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రెగ్యులర్ విద్యార్థులు తమ పాఠశాలల ద్వారా వీటిని పొందొచ్చు. అడ్మిట్ కార్డులపై సంబంధిత పాఠశాల ప్రిన్సిపల్ సంతకం తప్పనిసరి. వారి సంతకం లేకపోతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అడ్మిట్ కార్డులో రోల్ నంబర్, పరీక్ష కేంద్రం పేరు, రిపోర్టు చేయాల్సిన సమయంతో పాటు విద్యార్థులకు పలు కీలక సూచనలు ఉంటాయి.

సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15న మొదలై మార్చి 18తో ముగియనుండగా.. 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15న ఆరంభమై ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నాయి.

# నా పోరాటం ఆగదు.. వారిని వదలను.. రఘురామ మాస్ వార్నింగ్

అమరావతి: వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి తన మనోభావాలు చెప్పాలని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. ప్రతిపక్ష హోదా స్పీకర్, సీఎం ఇస్తారా? ప్రజలు ఇవ్వాలని చెప్పారు. ఎమ్మెల్యే ఎవరైనా 60 రోజులపాటు లీవ్ అడగకుండా సభకు రాకుంటే.. అనర్హత పడుతుందని అన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌లో పీవీ సునీల్ పాత్రపై రఘురామ స్పష్టంచేశారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. దోషులకు శిక్ష పడుతుందనే సంపూర్ణ విశ్వాసం ఉందని అన్నారు. ప్రభుత్వానికి తాను ఒక బాదితుడిగా పిర్యాదు చేశానని రఘురామ తెలిపారు. శాసన సభ్యుడు ఎవరైనా 60 రోజుల పాటు సరైన కారణం చెప్పకుండా అసెంబ్లీకి రాకపోతే అనార్హత వర్తిస్తుందని... అప్పుడు పులివెందులకు ఉపఎన్నికలు వస్తాయని రఘురామ కృష్ణరాజు చెప్పారు. జగన్ అసెంబ్లీకి రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. ఈ ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉందని.. దోషులకు శిక్ష పడుతుందని తెలిపారు. గతంలోతాను ఎన్నో ఫిర్యాదులు చేశానని గుర్తుచేశారు. సమాజాన్ని



మతాలు, కులాల వారిగా విడగొట్టే విధంగా వైసీపీ నేతలు మాట్లాడారని ఆరోపించారు. సునీల్ కుమార్ అతి తెలివి తేటలు ఉపయోగించి యూట్యూబ్‌లో ఉన్న వీడియోలు తీసేశారని చెప్పారు. ప్రభుత్వానికి తాను ఒక బాదితుడిగా ఫిర్యాదు చేశానని తెలిపారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇస్తే దానిపై ఐపీఎస్ అధికారి ఇష్టానుసారంగా మాట్లాడారని అన్నారు. సునీల్ కుమార్‌ను ఎప్పుడు సస్పెండ్ చేస్తారని ప్రభుత్వాన్ని అడిగానని అన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌పై పోరాటం ఆగదని రఘురామ స్పష్టం చేశారు.

## కూటమి అభ్యర్థుల ఘన విజయం.. పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపు..




గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అదరగొట్టారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీకి చెందిన మొత్తం ఆరుగురు అభ్యర్థులు పోటీ చేసి, అందరూ విజయం సాధించారు. దీంతో గుంటూరు నగరంలో టీడీపీ అభ్యర్థులతో పాటు కూటమి అభ్యర్థులు కూడా పుంజుకున్నారని తెలుస్తోంది.

**ఈ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల వివరాలు..** ఈరంటి వర ప్రసాద్ – టీడీపీ, కొమ్మినేని కోటేశ్వరరావు – టీడీపీ, నూకవరపు బాలాజీ – టీడీపీ, ముప్పవరపు భారతి – టీడీపీ, షేక్ మీరావలి – టీడీపీ, దాసరి లక్ష్మి దుర్గ – జనసేన.

**గెలిచిన వారికి..** దీంతో ఈసారి గుంటూరు నగరంలో ఎంచుకున్న ఆరుగురు అభ్యర్థుల విజయం ఈ పార్టీల పట్ల మరింత ఆదరణ వచ్చిందని చెప్పవచ్చు. టీడీపీ అభ్యర్థుల విజయాలు పార్టీలో మరింత ఉత్సాహాన్ని పెంచాయి. ఈ అభ్యర్థుల విజయంతో గుంటూరు నగరంలో టీడీపీ రాజకీయ ప్రస్థానం మరింత బలపడినట్లయింది. టీడీపీకి చెందిన ఈ అభ్యర్థులు తమ పోటీలో ఇతర పార్టీ అభ్యర్థులను బీట్ చేసి గెలుపొందారు. ఈ విజయం నేపథ్యంలో ఇతర టీడీపీ నేతలు గెలిచిన వారిని ప్రశంసిస్తున్నారు. ఫోన్లు చేయడంతోపాటు సోషల్ మీడియా వేదికగా ట్వీట్లు చేసి మెచ్చుకుంటున్నారు.

**జనసేన అభ్యర్థి గెలుపు :** జనసేన పార్టీకి చెందిన దాసరి లక్ష్మి దుర్గ ఈ ఎన్నికలో విజయం సాధించి, పార్టీకి గుంటూరు నగరంలో మరింత ఉత్సాహాన్ని కలిగించారు. ఆమె గెలుపు, జనసేన పార్టీకి మరింత గౌరవం తెచ్చినట్లు చర్చలు జరుగుతున్నాయి. దీంతోపాటు జనసేన పార్టీ కార్యకర్తలు కూడా ఈ విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**గెలిచిన అభ్యర్థులు ఏమన్నారంటే..** ఈ విజయం గుంటూరు నగర పాలక సంస్థలో ఆర్థిక అభివృద్ధి, స్థానిక సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టే విధానంలో మార్పులు తెచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ఇది స్థానిక నాయకత్వంలో పార్టీలు నిర్వహించే కార్యాలయాలు, ప్రణాళికలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉంటుంది. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత గుంటూరు నగర పాలక సంస్థలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని గెలిచిన అభ్యర్థులు చెబుతున్నారు.

## డాకు ప్రమోషన్స్‌లో ప్రగ్య స్టన్నింగ్

ఎన్బీకే సరసన డాకు మహారాజ్‌లో నటించింది ప్రగ్య జైశ్వాల్. తన అద్భుత నటనకు మంచి పేరొచ్చింది. అఖండ లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన బాలయ్య ఇప్పుడు డాకు మహారాజ్ రూపంలో ప్రగ్యకు మంచి బ్లాక్ బస్టర్ ని ఇచ్చాడు. ఈ సందర్భంగా ఆనందోత్సాహాల్లో మునిగి తేల్తోంది ప్రగ్య. ఈ విజయం సౌత్ లో తన కెరీర్ ఎదుగుదలకు సహకరిస్తుందని ఆశిస్తోంది. తాజాగా డాకు మహారాజ్ విజయోత్సవ ప్రచార వేదికపై ప్రగ్య ఎంతో ఆనందంగా కనిపించింది. ఈ సంవత్సరాన్ని మరింత మెరుగ్గా ప్రారంభించాలని



నేను కోరుకుంటున్నాను. జనవరి ఎంత అద్భుతమైన నెలగా మారింది – మొదటి వారంలోనే 3 ఖండాలు ప్రయాణించాను. అత్యంత రద్దీగా, క్రేజీగా, అత్యంత అలసిపోయేలా చేసింది కానీ.. అత్యంత సంతోషకరమైనది – అత్యంత సంతృప్తినిచ్చింది. అందరి ప్రేమకు ధన్యవాదాలు. నా హృదయం చాలా నిండిపోయింది! మిగిలిన సంవత్సరం ఎలా ఉంటుందో వీక్షించే వరకు వేచి ఉండలేనుఅని రాసింది. ఈవెంట్లో ప్రగ్య సాంప్రదాయ చీరకట్టులో ఎంతో అందంగా కనిపించింది. బ్లాక్ అండ్ పర్పుల్ కలర్ కాంబినేషన్ శారీలో ధగధగా మెరిసిపోతోంది. ప్రస్తుతం ఈ అందమైన ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. ప్రగ్య నెక్ట్స్ ఏమిటో ప్రకటించాల్సి ఉంది. బ్లాక్ బస్టర్ %-%డాకు మహారాజ్%-%ని సల్మాన్ ఖాన్ రీమేక్ చేస్తే బావుంటుందని ప్రగ్య సూచించిన సంగతి తెలిసిందే.

## అలా అడిగే సరికి పూజాహెగ్డే కి కోపం తన్నుకొచ్చింది!

ముంబై బ్యూటీ పూజాహెగ్డే బాలీవుడ్ మీడియాపై సీరియస్ అయిందా? పాత్రికేయుల తీరుతో తీవ్ర అసహనానికి గురైందా? ఇరువురి మధ్య నువ్వెంతంటే నువ్వెంతనే వరకూ సీన్ దారి తీసిందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. షాహిద్ కపూర్, పూజాహెగ్డే జంటగా నటించిన 'దేవా' చిత్రం రిలీజ్ లో భాగంగా ఇద్దరు ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో పూజాహెగ్డే ఓ ఇంటర్వ్యూలో పాల్గోంది. ఇంటర్వ్యూ అంతా సజావు గా సాగుతుంది. వాతావరణమంతా కూల్ గా ఉంది. సరిగ్గా ఇదే సమయంలో బాలీవుడ్ స్టార్ హీరోలతో నటించడాన్ని అదృష్టంగా భావిస్తున్నారా? ఆ చిత్రాలకు మీరు అర్హులే అనుకుంటున్నారా? అని ఒకరు అడిగారు. దానికి పూజా ఇలా బధులిచ్చింది.%-% అందుకు అర్హురాలినే. దర్శక, నిర్మాతలు నన్ను ఎంచుకోవడానికి కొన్ని కారణాలుంటాయి. ఏ పాత్రలో అవకాశం వచ్చినా దానికి పూర్తిగా న్యాయం చేయాలి. అందుకు



తగ్గట్టు నన్ను నేను మలుచుకోవాలి. అలా చేస్తే అదృష్టం వరించినట్లే భావిస్తా. ఇప్పటి వరకూ నా జీవితంలో అదే జరిగింది. ఒకవేళ అదృష్టం వల్లే అవకాశాలు వచ్చాయి అనుకుంటే? అందుకు నేను బాధపడను. అలాగే అనుకోండని బధులిచ్చింది. ఆ వెంటనే మరొకరు స్టార్ హీరోలైతేనే సినిమాలు చేస్తారా? అని అడిగారు. దీంతో పూజాహెగ్డేకి ఎక్కడ లేని కోపం చిర్రెత్తుకొచ్చింది. అసలు మీ సమస్య ఏంటని ఒక్కసారిగా అడిగిన వాళ్లపై సీరియస్ అయింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా హీటెక్కింది. మాట మాట పెరిగేలా కనిపించింది. దీంతో పక్కనే ఉన్న షాహిద్ కపూర్ లైన్ లోకి వచ్చి సరదాగా అక్కడ సన్నివేశాన్ని మార్చాడు. నువ్వు నటించిన స్టార్ హీరోలంటే అతడికి ఇష్టం అను కుంటా. అతడు కూడా వాళ్లతో నటించాలనుకుంటున్నాడు. అందుకే నిన్ను అడిగి నీ సలహాలు తీసుకుంటున్నారుని సముదాయించాడు. దీంతో అక్కడ వాతావరణం కూల్ అయింది.





## కాప్ స్టోరీలతో కాక పుట్టించేలా స్టార్ హీరోలు!




వెండి తెరపై కాకీ కథల పవరేంటో చెప్పాల్సిన పనిలేదు. స్టార్ హీరోలు కాప్ స్టోరీల్లో నటిస్తున్నారంటే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. అయితే ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో ఆ తరహా సినిమాలు కాస్త తగ్గాయి. డిఫరెంట్ జానర్లవైపు చూడటంతో కాకీ పవర్ తగ్గింది. అప్పుడప్పుడు కొన్ని సినిమాలు రిలీజ్ అయినా పోలీస్ పాత్ర అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంది. నిఖార్సైన కాకీ కథలకు గ్యాప్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో వేసవి కానుకగా కొన్ని కాప్ స్టోరీలు ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అవుతున్నాయి. మాస్ రాజా రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో 'మాస్ జాతర' తెరకెక్కుతోంది. ఇందులో రాజా పోలీస్ పాత్ర పోషిస్తున్నాడు. విక్రమ మార్కుడు, పవర్, క్రాక్, వాల్తేరు వీరయ్య పోలీస్ తర్వాత మాస్ రాజా మళ్లీ పోలీస్ యూనిఫాంలో కనిపించలేదు. మళ్లీ 'మాస్ జాతర' కోసం యూనిఫాం వేసాడు. అయితే ఈసారి యూనిఫాం వేసింది రైల్వే ప్రొటక్షన్ కోసం. లక్ష్మణ్ భేరి అనే రైల్వే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. అలాగే నేచురల్ స్టార్ నాని సీరియస్ పోలీస్ గా ఇంతవరకూ కనిపించలేదు. తొలిసారి 'హిట్ ది థర్డ్ కేస్' కోసం క్రైమ్ ఆఫీసర్ గా బరిలోకి దిగుతున్నాడు. ఇది చాలా సీరియస్ అండ్ పవర్ ఫుల్ రోల్. ఇంటెన్స్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ లోనటించడం ఇదే తొలిసారి. దీంతో నాని అర్జున్ సర్కార్ అనే పోలీస్ పాత్రలో పవర్ ఫుల్ గా కనిపించ నున్నాడు. మే1న ఈ చిత్రం రిలీజ్ అవుతుంది. ఇక విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి ఓ స్పై థ్రిల్లర్ ని రూపొందిస్తున్నాడు. ఇందులో విజయ్ 'పోకిరి'లో మహేష్ రేంజ్ అండర్ కవర్ కాప్ గా కనిపించనున్నాడు. విజయ్ ఎంతో ఇష్టపడి చేస్తోన్న చిత్రమిది. మహేష్ రేంజ్ లో ఎలివేషన్లు ఉంటాయని అభిమానులు ఆశిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న చిత్రం మేలో మొదటి భాగం రిలీజ్ అవుతుంది.

అలాగే యువ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో 'టైసన్ నాయుడు'లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో బెల్లంకొండ తొలిసారి పోలీస్ గెటప్ లో కనిపించనున్నాడు. ఈపోలీస్ కాస్త డిఫరెంట్ గానూ మెప్పించనున్నాడు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఏప్రిల్ లో రిలీజ్ కానుంది. ఇలా ఈ సమ్మర్ వరుస పోలీసు స్టోరీలతో మరింత హీటెక్కనుంది.

## కిరణ్ అబ్బవరం..మరో సర్ ప్రైజ్



గత ఏడాది 'క' మూవీతో కెరియర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నెక్ట్స్ ప్రాజెక్ట్స్ విషయంలో చాలా ప్లాన్డ్ గా వెళ్తున్నారు. 'క' కంటే ముందుగా కిరణ్ నటించిన 'దిల్ రుబా' మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. ప్రేమకథతో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ మూవీతో మరో హిట్‌ని తన ఖాతాలో వేసుకోవాలని కిరణ్ అబ్బవరం అనుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఈ కిరణ్ అబ్బవరం తో మూవీస్ చేయడానికి చిన్న నిర్మాతల నుంచి బడా ప్రొడ్యూసర్స్ వరకు సిద్ధంగా ఉన్నారు. అతనితో మినిమమ్ 15 నుంచి 20 కోట్ల బడ్జెట్స్ లో మూవీస్ ప్లాన్ చేస్తున్నారు. చాలా మంది ప్రొడ్యూసర్స్ ఇప్పటికే కిరణ్ కి అడ్వాన్స్ లు ఇచ్చి ఉన్నారని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే కిరణ్ అబ్బవరం నెక్ట్స్ సినిమాకి సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. సందీప్ కిషన్ హీరోగా 'మజాకా' సినిమా తో చేస్తోన్న హాస్య మూవీస్ కిరణ్ తో కొత్త చిత్రాన్ని ఎనౌన్స్ చేసింది. దీనికి సంబందించిన ఒక పోస్టర్ ని రిలీజ్ చేశారు. హాస్య మూవీస్ ప్రొడక్షన్ నెంబర్ 7గా ఈ చిత్రం తెరక్కబోతోంది. ఈ మూవీ టైటిల్ రిలీజ్ తో పాటు పూజా కార్యక్రమం రామానాయుడు స్టూడియోస్ లో జరగబోతోందని కాన్సెప్ట్ పోస్టర్ లో తెలియజేసారు. ఈ సినిమా క్యాస్టింగ్ అండ్ క్రూ గురించి కూడా మేగ్జిమమ్ సోమవారమే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఈ కాన్సెప్ట్ పోస్టర్ బ్యాక్ డ్రాప్ చూస్తుంటే ఇది కూడా విలేజ్ బ్యాక్ డ్రాప్ కథగానే ఉండబోతున్నట్లు కనిపిస్తోంది. మరి ఈ సినిమా కోసం కిరణ్ ఎలాంటి కథని ప్రేక్షకులకి చూపించబోతున్నాడనేది ఆసక్తికరంగా మారింది. కిరణ్ అబ్బవరం గత ఏడాది తన ప్రియురాలు రహస్య గోరఖ్ ని వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజుల క్రితం ఆమె గర్భవతిగా ఉన్నట్లు అఫిషియల్ గా ప్రకటించారు. అదే ఉత్సాహంలో కొత్త సినిమాని సెట్స్ పైకి తీసుకొని వెళ్లబోతున్నాడు. 'క' తర్వాత కిరణ్ అబ్బవరం స్టోరీ సెలక్షన్స్ పూర్తిగా మారిపోయిందనే మాట వినిపిస్తోంది. స్ట్రాంగ్ కథాబలం ఉన్న సినిమాలకి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నాడు. కెరియర్ ని కూడా పర్ఫెక్ట్ గా బిల్డ్ చేసుకునే పనిలో పడ్డాడు. మరి నెక్ట్స్ సినిమాలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయో చూడాలి.

## సామ్ తో బాలీవుడ్ యాక్టర్.. ఈ విషయం తెలుసా?

స్టార్ హీరోయిన్ సమంత.. రీసెంట్ గా సిటడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన ఆ సిరీస్ లో బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ మరో కీలక పాత్ర పోషించారు. 80-90ల కాలంలో సమాజంలో మహిళల పరిస్థితి ఏంటనేది సిరీస్ లో చక్కగా చూపించారు మేకర్స్. అయితే వరల్డ్ వైడ్ గా భారీ స్థాయిలో ఫ్యాన్ అందుకున్న సిటడెల్ వెబ్ సిరీస్ లో సామ్ తన నటనతో అదరగొట్టింది. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్ లో అందరినీ మెప్పించిందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. దీంతో అనేక మంది ప్రశంసలు అందుకుంది. విమర్శకులు కూడా సమంత యాక్టింగ్ ను కొనియాడారు. అదే ఇప్పుడు సామ్.. మరో యాక్షన్ థ్రిల్లర్ రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్ డమ్ చేస్తున్న విషయం తెలిసిందే. సిటడెల్ షూటింగ్ జరుగుతుండగానే.. సమంత రక్త్ బ్రహ్మాండ్ సిరీస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఇప్పటికే



టాక్ వచ్చింది. నెట్ ఫ్లిక్స్ ఒరిజినల్ సిరీస్ గా వస్తున్న రక్త్ బ్రహ్మాండ్ కు తుంబాద్ ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్నారు. ఫ్యామిలీ మ్యాన్, సిటడెల్ సిరీస్ ల డైరెక్టర్లు రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. అయితే ఓ రాజవంశ కుటుంబం నేపథ్యంలో రక్త్ బ్రహ్మాండ్ సిరీస్ రూపొందుతున్నట్లు తెలుస్తోంది. రాజ్యం కోసం కుటుంబంలోని ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే పోరాటాలతోపాటు రాజకీయ అంశాల్లో సాగనుందని.. సామ్ యువరాణి పాత్రలో కనిపిస్తుందని టాక్ వినిపిస్తోంది. అయితే ప్రముఖ బాలీవుడ్ నటుడు ఆదిత్య రాయ్ కపూర్ రక్త్ బ్రహ్మాండ్ లో సమంతతో కలిసి స్క్రీన్‌ను పంచుకోనున్నారని ఇప్పుడు తెలుస్తోంది. ఆదిత్య ఇటీవల యాక్షన్-ప్యాక్డ్ మొదటి షెడ్యూల్ ను పూర్తి చేశారని సమాచారం. తన రోల్ కోసం కత్తి యుద్ధంతోపాటు వివిధ మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందారట. ఇక రక్ష్ బ్రహ్మాండ్ లో మీర్జాపూర్ ఫేమ్ అలీ ఫజల్, వామిక గబ్బి కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ కు చెందిన బడా స్టార్లు కూడా సిరీస్లో భాగం కానున్నారని టాక్ వినిపిస్తోంది. కాగా 2025లో సిరీస్ ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. మరి రక్త్ బ్రహ్మాండ్ సిరీస్ ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందో వేచి చూడాలి.

## ఫీమేల్ హ్యారీపోటర్.. శ్రద్ధాకు కితాబు

భారతదేశంలోని అత్యంత అందమైన, ప్రతిభావంతురాలైన నటిగా శ్రద్ధా కపూర్ కి గుర్తింపు ఉంది. శక్తికపూర్ నటవారసురాలిగా సినీపరిశ్రమలో అడుగుపెట్టినా కానీ తనదైన స్టైల్, ప్రతిభతో ఈ భామ సత్తా చాటింది. బాలీవుడ్ అగ్రకథానాయికల్లో ఒకరిగా నిలదొక్కుకుంది. నేడు దేశంలోని అత్యంత భారీ పాన్ ఇండియన్ ప్రాజెక్టుల్లో నటించే అవకాశాల్ని శ్రద్ధా అందుకుంటోంది. ముఖ్యంగా శ్రద్ధా కపూర్ అందం, ఆహార్యానికి ఫిదా కాని అభిమాని లేడు. సోషల్ మీడియాల్లో కోటి మంది పైగా అభిమానులున్నారు. శ్రద్ధా నిరంతరం తన ఇన్‌స్టా, డిజిటల్ పోస్టులతో కుర్రకారు గుండెల్ని కొల్లగొడుతోంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. కళ్లజోడు, భారీ కోట్ ధరించిన శ్రద్ధాను చూడగానే 'ఫీమేల్ హ్యారీపోటర్' అంటూ అభిమానులు కితాబిచ్చేశారు. శ్రద్ధా ధరించిన కళ్లజోడు, డ్రెస్ కోడ్ అచ్చం హ్యారీపోటర్ ని తలపించడంతో అభిమానులు సరదాగా ఫీమేల్ హ్యారీపోటర్ అని పిలిచేస్తున్నారు.



బుర్గుండి స్పోర్ట్స్ జాకెట్‌లో సూపర్ క్యూట్‌గా కనిపించిన శ్రద్ధా ఇదే ఫోటోషూట్ లో థై స్లిట్ ఫ్రాకులో కనిపించి ఆశ్చర్యపరిచింది. తాజా ఫోటోషూట్ కి శ్రద్ధా 'ట్రయల్ రన్' అంటూ అందమైన క్యాప్షన్ ని ఇచ్చింది. సంవత్సరంలో మొదటి నెల ఎల్లప్పుడూ టెస్ట్ రన్ లాగా అనిపిస్తుందని తన అభిమానుల్లో చాలామంది అంగీకరించారు. శ్రద్ధా అందమైన వ్యక్తిత్వం సరదా పరాచికాలు అభిమానులను నవ్విస్తూనే ఉన్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే గత ఏడాది 'స్త్రీ 2' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రద్ధా ప్రస్తుతం నాగిన్ గా నటించేందుకు సిద్ధమవుతోంది. రణ్ వీర్- ఫర్హాన్ కాంబినేషన్ లోని మోస్ట్ అవైటెడ్ డాన్ 3లో, అలాగే హృతిక్ క్రిష్ 4లో శ్రద్ధా కథానాయికగా నటిస్తుందని కథనాలొస్తున్నాయి. తన తదుపరి భారీ చిత్రం గురించి ప్రకటన వెలువడ నుందని కూడా తెలుస్తోంది.




## ఆప్ ప్రభుత్వంలో వారు మాత్రమే 10వ తరగతికి: విద్యార్థులతో మోదీ మాటామంతీ

దిల్లీ: మరో రెండు రోజుల్లో దేశ రాజధాని దిల్లీకి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రచారానికి సోమవారమే ఆఖరు తేదీ కావడంతో రాజకీయం వేడెక్కింది. చివరి రోజు ప్రధాన పార్టీలన్నీ జోరుగా ప్రచారం చేపట్టాయి. ఈక్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాజాగా కొంతమంది దిల్లీ విద్యార్థులతో ముచ్చటించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తమ విజయంగా చెప్పే విద్యా విధానంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. "దిల్లీ పాఠశాలల్లో 9వ తరగతి దాటి చదివేందుకు అందరు విద్యార్థులను వారు (ఆమ్ ఆద్మీ పార్టీ) అనుమతించడం లేదని విన్నాను. కేవలం పాస్ అవుతారన్న గ్యారంటీ ఉన్నవారిని మాత్రమే పైతరగతులకు పంపిస్తున్నారట. ఎందుకంటే రిజల్ట్ సరిగా రాకపోతే.. ప్రభుత్వం పరువు పోతుందని వారు భావిస్తున్నారు. ఇలా విద్యా వ్యవస్థలోనూ వారు అవినీతికి పాల్పడుతున్నారు" అని విద్యార్థులతో ప్రధాని అన్నారు. ఆప్ ప్రతిష్ఠను పెంచుకునేందుకు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మోదీ దుయ్యబట్టారు. దిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో 9, 11వ తరగతుల్లో ఫెయిలయ్యే వారి సంఖ్య అధికంగా ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి. ఏటా లక్ష మందికి పైగా 9వ తరగతిలో ఫెయిల్ అవుతున్నారని గతంలో కొన్ని కథనాలు వెలువడ్డాయి. దీన్ని ఉద్దేశిస్తూనే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఇక, 70 మంది శాసనసభ్యులున్న దిల్లీకి ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

ఈ ఎన్నికల్లో భాజపా, ఆమ్ ఆద్మీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. తమ హయాంలో విద్యా విధానాన్ని ఆధునికీకరించి ఎంతోమంది విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నామని, ఆసుపత్రులు కట్టించామని ఆమ్‌ఆద్మీ పార్టీ చెబుతోంది. భాజపా అధికారంలోకి వస్తే చాలా పాఠశాలలు, ఆసుపత్రులు మూతపడతాయని ఆప్ ఆరోపిస్తోంది. అటు మద్యం కుంభకోణాన్ని ప్రధానంగా ఎత్తిచూపుతూ భాజపా విమర్శనాస్త్రాలు విసురుతోంది.




దేశంలో నిరుద్యోగ సమస్యకు యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలు సరైన పరిష్కారం చూపించలేకపోయాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఉత్పత్తి ఆధారిత దేశంగా మనం విఫలమై.. దానిని చైనాకు అప్పగించామన్నారు. ఇకనైనా మనం ఉత్పత్తి పైనే పూర్తిగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. 'మేకిన్ ఇండియా' మంచి ఆలోచనే అయినప్పటికీ దానిని అమలుచేయడంలో మోదీ విఫలమయ్యారని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో చర్చ సందర్భంగా మాట్లాడిన రాహుల్.. ఆ ప్రసంగంలోని అంశాలు ఏటా ఒకేలా ఉంటున్నాయని వ్యాఖ్యానించారు. "యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉంది. మనం మాట్లాడేది ఏదైనా వారి గురించే అయి ఉండాలి. మనదేశం అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేకపోయాం. గతంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్డీయేలు ఉపాధి ఉపాధి కల్పన గురించి దేశ యువతకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయాయి. 'మేకిన్ ఇండియా' ఆలోచన మంచిదే. కానీ దీనిలో ప్రధాని మోదీ విఫలమయ్యారు. ఉత్పత్తి రంగంలో భారత్ నిలదొక్కుకోకపోవడం వల్ల చైనా ఇక్కడ మకాం వేసింది. తయారీలో మనం విఫలమై, చైనాకు అప్పగించాం. ఇప్పటికైనా తయారీపైనే పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది. దేశంలో సామాజిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు.. ప్రచారానికి తెర





దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. సాయంత్రం 5గంటలకు అన్ని రాజకీయ పార్టీల మైకులు మూగబోయాయి. 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. 8వ తేదీన వారి భవితవ్యం తేలనుంది. పోలింగ్‌కు ముందు రెండు రోజులు కీలకం కావడంతో అప్రమత్తమైన ఎన్నికల సంఘం.. ప్రలోభాలను అరికట్టేందుకు నిఘా పెంచింది. చివరి రోజున రాజకీయ పార్టీలు హోరాహోరీ ప్రచారం నిర్వహించాయి. అధికారం కాపాడుకునేందుకు అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ అనేక హామీలతో ప్రజల్లోకి వెళ్లింది. రెండు దశాబ్దాలకు పైగా అధికారానికి దూరమైన భాజపా.. చివరి రోజు 22 రోడ్ షోలు నిర్వహించింది. ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేసింది. 2013కు ముందు పదిహేనేళ్లు పాలించిన కాంగ్రెస్.. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేసింది. మరోవైపు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది.

**దిల్లీ పీఠం ఎవరిదో?** ఎన్నికల సంఘం ప్రకారం.. దిల్లీలో 1.56కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరికోసం 13,766 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా.. ఇందులో దివ్యాంగుల కోసం 733 కేంద్రాలున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీని తెలుసుకునేందుకు క్యూ మేనేజిమెంట్ సిస్టమ్ అప్లికేషన్‌ను దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం ముందస్తు పోలింగ్ సదుపాయం కల్పించగా.. ఇప్పటికే 7980 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


పోలింగ్ నేపథ్యంలో దేశ రాజధానిలో భారీ సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించారు. 200 కంపెనీలకుపైగా సాయుధ బలగాలు, 15వేల మంది హోంగార్డులు, 35వేల మంది దిల్లీ పోలీసులు ఎన్నికల విధుల్లో ఉండనున్నారు. 3వేల పోలింగ్ బూత్‌లను సున్నితమైనవిగా గుర్తించిన ఎన్నికల అధికారులు.. కొన్ని ప్రాంతాల్లో డ్రోన్లతో పర్యవేక్షించేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి జనవరి 7 నుంచి ఇప్పటివరకు 1049 కేసులు నమోదయ్యాయి. లక్ష లీటర్ల మద్యాన్ని సీజ్ చేయడంతోపాటు 1353 మందిని అరెస్టు చేశారు. రూ.77కోట్ల విలువైన 196 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.




## భాజపా తెలంగాణ అధ్యక్ష పదవి.. తెరపైకి కొత్త పేర్లు!

హైదరాబాద్: తెలంగాణ కమల దళపతి నియామకం ఈ నెల 15 నాటికి పూర్తవుతుందని భాజపా వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే అధ్యక్ష రేసులో ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రామచందర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పాత, కొత్త అనే విభేదాలు తలెత్తడంతో అధిష్ఠానం మధ్యేమార్గాన్ని అన్వేషిస్తున్నట్లు సమాచారం. దీంతో అధ్యక్ష పదవి కోసం తెరపైకి కొత్తపేర్లు వచ్చాయి. అనూహ్యంగా మురళీధర్ రావు, డీకే అరుణ పేర్లు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరిలో ఒకరికి అధ్యక్ష పదవి దక్కితే బీసీలకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర శాసనసభాపక్షనేతగా రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి కొనసాగుతున్నారు. అధ్యక్ష పదవి రెడ్డి లేదా వెలమకు దక్కితే బీసీల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది కాబట్టి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని తెరపైకి తెచ్చింది. బీసీలకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని భావిస్తోంది. ఈటల లేదా ధర్మపురి అర్వింద్‌లో ఒక్కరికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ బీసీకి అధ్యక్ష పదవి దక్కితే వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రస్తావన లేనట్లేనని కాషాయ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

## మంచు ఫ్యామిలీ ఇష్యూ.. విచారణకు తండ్రీ, కొడుకులు



హైదరాబాద్, ఫిబ్రవరి 3: మంచు ఫ్యామిలీ వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. నటుడు మంచుమోహన్, మంచు మనోజ్ సోమవారం నాడు రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. నటుడు మోహన్ బాబు ఫిర్యాదుతో రంగారెడ్డి సబ్‌కలెక్టర్.. ఇద్దరినీ విచారణకు పిలిచారు. ఈ క్రమంలో మోహన్ బాబు, మనోజ్ ఒకరి తర్వాత ఒకరు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా తనతో పాటు కీలక డాక్యుమెంట్లను తీసుకొచ్చారు మంచు మనోజ్. వీరిరువురిని సబ్‌కలెక్టర్ విచారించనున్నారు. మంచు ఫ్యామిలీలో ఆస్తి తగాదాలు కొనసాగుతున్నాయి. సంక్రాంతి సమయంలో కూడా వారి మధ్య గొడవలు మరోసారి బయటపడ్డాయి.

అయితే తన ఆస్తుల్లో ఉన్న అందర్నీ ఖాళీ చేయించాలంటూ రంగారెడ్డి జిల్లా మెజిస్ట్రేట్‌కు మంచు మోహన్ బాబు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. జల్‌పల్లిలో ఉన్న తన ఆస్తులను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో తెలిపారు. ప్రస్తుతం జల్‌పల్లిలోని ఇంట్లో మంచు మనోజ్ నివాసం ఉండగా.. మోహన్ బాబు తిరుపతిలో ఉంటున్నారు. ఈ క్రమంలో సీనియర్ సిటిజన్ ఆక్ట్ ప్రకారం తన ఆస్తులను స్వాధీనం చేసి ఇవ్వాలని మోహన్ బాబు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మనోజ్‌కు నోటీసులు ఇచ్చారు. అలాగే పోలీసుల దగ్గర నుంచి మోహన్ బాబు ఆస్తులపై నివేదిక తీసుకున్నారు కలెక్టర్. ఈ నోటీసుల మేరకు మనోజ్ ఇప్పటికే రంగారెడ్డి సబ్ కలెక్టర్ ఎదుట విచారణకు తొలిసారి హాజరయ్యారు. తమవి ఆస్తి గొడవలు కాదని, తమ విద్యాసంస్థలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించినదుందుకు ఆస్తి గొడవలుగా ప్రచారం చేస్తున్నారని అప్పట్లో మనోజ్ చెప్పారు. కుటుంబసభ్యులు అంతా కూర్చుని మాట్లాడుకుందామని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ కూడా స్పందించడం లేదని మనోజ్ అన్నారు. ఇదిలా ఉండగా.. ఈరోజు రంగారెడ్డి సబ్‌కలెక్టర్ ఎదుట విచారణకు హాజరయ్యారు మోహన్ బాబు. అలాగే మనోజ్ కూడా మరోసారి విచారణకు వచ్చారు.




తెలంగాణలో మరికొన్ని రోజుల్లో ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అయితే సుప్రీంకోర్టులో ఫిబ్రవరి 10న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ జరగనున్న నేపథ్యంలో కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలో రాజ్యాంగం నిర్దేశించిన చట్టం ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపుదారులను రక్షించడం అసాధ్యమని కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

**ఉప ఎన్నికలతోపాటు...** దీంతో తెలంగాణలో ప్రస్తుతం ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశం పెద్ద చర్చకు దారితీస్తుంది. రాజ్యాంగం ప్రకారం, ఫిరాయింపు ఎమ్మెల్యేలు పార్టీ మారడం లేదా శాసనసభ నుంచి అనర్హత పొందడం అనేది కీలక అంశంగా మారింది.

అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఈనెల 10న సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. సుప్రీంకోర్టులో వచ్చే ఆదేశాలను బట్టి జవాబుదారీగా ఎటువంటి నిర్ణయం తీసుకోబడినా, పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, తదుపరి ప్రయత్నాల కోసం చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు.

**గతంలో కూడా..** ఈ విచారణలో ముఖ్యంగా పార్టీ మారిన పలువురు ఎమ్మెల్యేలు ప్రత్యర్థుల నుంచి ఎదురు దాడి ఎదుర్కొంటున్నారు. ఈ అంశం తెలంగాణలో ప్రస్తుతం రాజకీయ భవిష్యత్తుపై అనేక ప్రశ్నలను రేపుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వచ్చే పరిణామాలు, కొత్త వ్యూహాలను మరింత జాగ్రత్తగా అంచనా వేస్తుందని తెలుస్తోంది. గతంలో కూడా అనేక ఇతర రాజకీయ పార్టీల నేతలు.. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల్లో గెల్చిన తర్వాత పలు పార్టీలకు మారిన సంఘటనలు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారిన ప్రతి సారీ కూడా ఈ పార్టీ ఫిరాయింపుల అంశం తెరపైకి వస్తుంది. ఈ క్రమంలో ఈసారి సుప్రీంకోర్టు దీనిపై ఎలాంటి తీర్పు వెలువరిస్తుందో చూడాలి మరి.

## నల్గొండ - ఖమ్మం - వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



నల్గొండ, ఫిబ్రవరి 3: నల్గొండ - ఖమ్మం - వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. నల్గొండ కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈనెల 8, 9 తేదీలలో ప్రభుత్వ సెలవు దినాలు ఉండటంతో ఈనెల 11న నామినేషన్ల పరిశీలించనున్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణనకు చివరి గడువు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4:00 వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగనుంది. వరంగల్- ఖమ్మం- నల్గొండ నియోజకవర్గ పరిధిలో మొత్తం 200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ఇలాత్రిపాటి తెలిపారు. అలాగే ఈ ఎన్నికల్లో 24,905 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అటు ఏపీలో కూడా గుంటూరు - కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైంది. ఫిబ్రవరి 3 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవగా..10 తేది వరకూ నామినేషన్లను స్వీకరించనున్నారు. 11 తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. అలాగే 13న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. అనంతరం ఈనె 27న తేదీన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్జరుగనుంది. మార్చి 3న కౌంటింగ్ జరుగనుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజాను కూటమి బలపరిచిన అభ్యర్థిగా ఉన్నారు. పీడీఎఫ్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఉన్నారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా వైసీపీ ఉండనుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవి కాలం మార్చి 27తో ముగుస్తున్న నేపథ్యంలో ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది.

## తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హత కేసు.. సుప్రీంకు కేటీఆర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు(సోమవారం) జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. బీఆర్ఎస్ తరపున సీనియర్ న్యాయవాది ఆర్య రామసుందరం వాదనలు వినిపించారు. ఇదే వ్యవహారంపై గతంలో దాఖలైన పిటిషన్‌కు కేటీఆర్ వేసిన పిటిషన్‌ను జతచేసింది ధర్మాసనం. కేటీఆర్ వేసిన పిటిషన్‌ను.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లా వెంకట్రావు అనర్హత పిటిషన్‌తో కలిపి వీటిని విచారిస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఈనెల10న పాత పిటిషన్‌తో కలిపి విచారణ చేస్తామని సుప్రీంకోర్టు వెల్లడిస్తూ.. తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి వేసిన పిటిషన్‌పై రెండు రోజుల క్రితం సుప్రీంలో విచారణ జరుగగా.. సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ స్పీకర్‌పై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ ఆలస్యం చేయడంపై సుప్రీం స్పందిస్తూ.. ఇంకా ఎంత సమయం కావాలంటూ గత విచారణలో ప్రశ్నించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేవరకా అంటూ సుప్రీం ప్రశ్నించింది. స్పీకర్‌కు ఎంత సమయం కావాలో మీరే కనుక్కుని చెప్పాలంటూ న్యాయవాది ముకుల్ రోహత్గీకి ధర్మాసనం ఆదేశించింది. ఆపై తదుపరి విచారణను వాయిదా వేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్ల వెంకటరావుపై అనర్హత వేటు వేయాలని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

## విద్యా వ్యవస్థపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

సిద్దిపేట జిల్లా: తెలంగాణలో విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయంయ తీసుకుంది. ప్రభుత్వ పక్షాన విద్యవ్యవస్థను మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరికీ విద్యా అందటానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదర్శ ఇందిరమ్మ పాఠశాలలు, నూతన నియామకాలు మౌలిక సదుపాయాలు అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. వసంత పంచమినీ పురస్కరించుకొని ఇవాళ(సోమవారం) వర్గల్ మండల కేంద్రంలోనీ శ్రీ విద్య సరస్వతి అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... తెలంగాణలో ప్రతి ఒక్క బిడ్డ ఉన్నత విద్యావంతుడై తెలంగాణ అభివృద్ధితో పాటుగా దేశంలో కూడా అన్ని రంగాల్లో ముందు ఉండాలని అమ్మవారి కటాక్షం ఉండాలని కోరుకున్నానని చెప్పారు. తల్లిదండ్రులు మీరు ఒక పూట శ్రమపడ్డ పిల్లలను చదివించడానికి శ్రద్ధ వహించాలని అన్నారు.

ఏ ఆస్తి అన్న ఎప్పుడైనా పోవచ్చు కాని విద్యాకు సంభందించిన ఆస్తి ఎప్పుడు పోదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో అటు బాసర ఇటు వర్గల్ సరస్వతి అమ్మవారి ఆలయాలు మన ప్రాంతంలో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం తరపున దేవాలయాల అభివృద్ధికి కానీ దేవాలయాలకు సంబంధించిన విద్యాలయాలకు అభివృద్ధికి సంభందించిన విషయంలో అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాలకార్మికులుగా చేర్చే ప్రయత్నం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com